www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 57  ఆదివారం, జూలై 12, 2026, పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్

టీ-వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్,జూలై 11 : సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం

మిగతా2లో...

# కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

● మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్ఎ ఆదేశాలు ● గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం ● గేట్లు మూస్తే ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందని హెచ్చరిక ● ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు ● బిఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల ● జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు ● ఈటెల, బిఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా ● మీడియా సమావేశంలో సిఎం రేవంత్ స్పష్టీకరణ



2లో



## వియత్నాంలో ఘోర ప్రమాదం

పర్యాటక బోటు బోల్తా పడి 19మంది జలసమాధి

పలువురు పరిస్థితి విషమం..ఆస్పత్రిలో చికిత్స

విహార యాత్రకు వెళ్లిన తెలుగువాలో పలువురు మృతి

మృతుల్లో కడప, మచిలీపట్నంలకు చెందిన వారు

రంగంలోకి దిగిన భారత ఎంబసీ..హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు

హనోయ్,జూలై 11 : వియత్నాంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు

మిగతా2లో...

## పోక్సో కేసు పెట్టారని ఆరుగురి దారుణ హత్య

హైదరాబాద్,జూలై 11 : రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో శనివారం తెల్లవారుజామున దారుణం జరిగింది. మండల కేంద్రంలోని దైవాలగూడ గ్రామంలో రాజ్‌కుమార్ (28)

మిగతా2లో...



## ప్రముఖ సింగర్ జానకి కన్నుమూత

హైదరాబాద్,జూలై 11 : ప్రముఖ సింగర్ ఎస్. జానకి శనివారం కన్నుమూశారు. మైసురులోని తన నివాసంలో ఆమెకు కార్డియక్ అరెస్ట్ జరగడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస

మిగతా2లో...



## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుంది

ప్రవాస భారతీయులు కృషి ఇందుకు ప్రధాన కారణం

న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ



2లో

## బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

● హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్ ● దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణకే ● దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ ● ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి ● వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర అంశంపై అశ్వినీ వైష్ణవ్




హైదరాబాద్,జూలై 11 : తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ

మిగతా2లో...

## కాలం తెచ్చిన కారుకు కాదు... కాంగ్రెస్ కరువు

- గోదావరిలో నీళ్లు ఉన్నా ఉపయోగించుకోని దరిద్రం
- కావాలనే నీటిని వృధాగా వదులుతున్నారు
- మీడియా సమావేశంలో మరోమారు కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,జూలై 11 : ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు. రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు

మిగతా2లో...



## సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం

హైదరాబాద్,జూలై 11 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్

మిగతా2లో...

## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

- మరోమారు ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు



హైదరాబాద్,జూలై 11 : ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్ల ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం

మిగతా2లో...

# వియత్నాంలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరపున డీలర్స్ టూరిస్ట్‌లుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తమిళనాడు వాసులు చనిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యుల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూడా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్ లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తు న్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారుల సహాయక చర్యలు పూర్తిగా ముగిసిన అనంతరం ఈ వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగి పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

**హైదరాబాద్,జూలై 11 :** కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. శనివారం మీడి యాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడి యా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటు న్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్‌ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకు న్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్ప దని ఎన్‌డిఎస్‌ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయా ంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభిం చాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్ప ట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరిం చాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పోక్సో కేసు పెట్టారని ఆరుగురి దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

అనే వ్యక్తి కక్షతో రగిలిపోతూ ఏకంగా ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేశాడు. ఒకేసారి ఆరుగురు వ్యక్తులు నెత్తుటి మడుగులో శవాలుగా మారిన ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర సంచలనం రేకెత్తించింది. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో ఒక బాలికను వేధించాడనే ఆరోపణలపై బాధితురాలు, ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజ్‌కుమార్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇటీవల బెయిల్‌పై జైలు నుండి బయటకు వచ్చిన రాజ్‌కుమార్.. తనపై కేసు పెట్టారన్న కక్షను పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున నిద్రపోతున్న బాధితులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ఊచకోత కోశాడు. ఈ దాడిలో ఫిర్యాదు చేసిన బాధిత బాలిక, ఆమె తల్లి, నానమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అంతటితో ఆగని నిందితుడు.. తన భార్య సరిత, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడిని కూడా అత్యంత అమానుషంగా కడతేర్చాడు. ఆరుగురిని చంపిన అనంతరం రాజ్‌కుమార్ స్వయంగా ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పాడు. కొడుకు చేసిన ఘాతుకాన్ని విని నిర్ఘాంతపోయిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అయితే, భార్యాపిల్లలను ఎందుకు హత్య చేశాడనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనా స్థలానికి చేరుకున్న సీపీ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్ వివరాలు సేకరించారు. బాధిత బాలిక, బాలిక తల్లి, నానమ్మ, నిందితుడి భార్య సరిత, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు హత్యకు గురైనట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

# జానకమ్మ మరణం 'పాట'కు తీరని లోటు.. ఆమె గాత్రం అజరామరం..!



**హైదరాబాద్,జూలై 11 :** సంగీత దర్శకురాలు, అభిమానులంతా 'జానకమ్మ' అని ప్రేమతో పిలుచుకునే, సినీ నేపథ్య గాయని ఎస్.జానకి (శిష్ట శ్రీరామమూర్తి జానకి) మరణం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ సంతాపం ప్రకటించారు. గాన కోకిలగా ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియుల హృదయాలను గెలుచుకున్న జానకమ్మ గాత్రం అజరామరమని కేసీఆర్ అన్నారు.చిన్ననాటి నుండే సంగీతం, గానం పట్ల మక్కువతో సినీ నేపథ్యగాయనిగా తన ప్రస్థానాన్ని సాగించిన జానకమ్మ, 60 యేండ్ల సంగీత జీవితంలో దాదాపు 50 వేల పాటలు పాడి, భారత సంగీతవనంలో పాటల కుసుమాలను పూయించిన మహోన్నత గాయని అని కేసీఆర్ కొనియాడారు. సినీ నేపథ్యగాయనిగా, సంగీత దర్శకురాలిగా.. తెలుగు, తమిళ ,కన్నడ, మళయాళీ.. తదితర భారతీయ భాషల్లో పాటలు పాడుతూ సినీ సంగీత జగత్తుకు చేసిన కృషి దేశ సాంస్కృతిక రంగంలో జానకి సువర్ణాధ్యాయాన్ని లిఖించిందని కేసీఆర్ అన్నారు.

# ప్రముఖ సింగర్ జానకి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విడిచారు. అనారోగ్యం, వయోభారం కూడా ఆమె మృతికి కారణంగా తెలుస్తోంది. అన్ని భాషలలో కలిపి జానకి 48 వేలకు పైగా పాటలు పాడారు.
"నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా" అని ఆమెను పిలుస్తారు.

# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

**ఆక్లాండ్,జూలై 11 :** భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం ముమ్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు.

# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు.ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు.

# కాలం తెచ్చిన కారుకు కాదు...కాంగ్రెస్ కరువు

(మొదటి పేజీ తరువాయి)

ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళ్లు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు.గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగి పోతుంది అంటున్న నీకు బుర్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమా ధానం చెప్పే దమ్ములేని దద్దమ్మఅనాలా,దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు.

# సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ పక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

# సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

# రోడ్డు ప్రమాదం, ఒకరు మృతి

**వెంకటాపూర్ :** మండలంలో శనివారం ఉదయం లింగాపూర్ అవుట్‌స్కర్ట్స్‌లో జాతీయ రహదారి 163పై ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. మల్లంపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి పెద్దులు (55) అనే వ్యక్తి తన ఎక్సెల్ వాహనంపై చిన్న వ్యాపారం చేసు కుంటూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం 5:30 గంటలకు మచ్చాపూర్ వెళ్తున్న క్రమంలో, హైదరాబాద్ నుండి ఏటూరునాగారం వైపు వస్తున్న ఒక లారీ, అతివేగంగా వచ్చి తూర్పాటి పెద్దులు ప్రయాణిస్తున్న ఎక్సెల్ మోటార్ సైకిల్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. కింద పడిన తూర్పాటి పెద్దులు పైనుండి లారీ వెళ్లడంతో, ఆయన అక్కడికక్కడే మరణిం చాడు. సమాచారం అందుకున్న వెంకటాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, వాహన రాకపోకలను మెరుగుపరిచి మృతదేహాన్ని ములుగు తరలించారు. మృతుడి భార్య తూర్పాటి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తూర్పాటి పెద్దులుకు ఒక కుమారుడు కలరు.






# ప్రైవేట్ రవాణా వాహనాల యజమానులు మోటారు వాహనాల చట్టం , నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

**- హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్.**

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 11 (పీపుల్స్ న్యూస్) :** ప్రైవేట్ రవాణా వాహనాల యజమానులు, డ్రైవర్లు , ఆపరేటర్లు అందరూ మోటారు వాహనాల చట్టం , నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విజ్ఞప్తి చేస్తోంది. హైదరాబాద్ నగరంలోని టీజీఆర్టీసీ బస్ స్టాండ్ల సమీపంలో అనధికారిక ప్రయాణీకుల రవాణా, మితిమీరిన ప్రయాణీకులను తరలించడం, పర్మిట్ నిబంధనల ఉల్లంఘన ఆటోలు, టాటా మ్యాజిక్, జీపులు, తూఫాన్ వాహనాలు, మ్యాక్సీ క్యాబ్‌లు , ఇతర ప్రైవేట్ రవాణా వాహనాల అక్రమ పార్కింగ్‌లపై టి.జి.ఆర్.టి.సి అధికారుల సమన్వయంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం ఈ నెల 6 నుండి నగరం అంతటా ఒక ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రత్యేక తనిఖీలలో భాగంగా మోటారు వాహనాల చట్టం నిబంధనలను ఉల్లంఘించిన ఆటోలు, టాటా మ్యాజిక్, జీపులు, తూఫాన్ వాహనాలు, మ్యాక్సీ క్యాబ్‌లు , ఇతర ప్రైవేట్ రవాణా వాహనాల డ్రైవర్లు/యజమానులపై మొత్తం 1860 కేసులు నమోదు చేశారు. బస్ స్టాప్ సమీపంలో పార్కింగ్ చేయడం లేదా వేచి ఉండటం పై 342 కేసులు, గూడ్స్ వాహనాలలో ప్రయాణీకులను తరలించినందుకు 141 కేసులు, బస్ బే లలో పార్కింగ్ చేసినందుకు 520 కేసులు, మితిమీరిన ప్రయాణీకులను ఎక్కించుకున్నందుకు 504 కేసులు నమోదు చేయబడ్డాయి. వీటితో పాటు, సరైన డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (=జ), ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ లేదా కాలుష్య నియంత్రణ (ౡశీశ్రీశ్రీబ్‌ఱశీఅ) పత్రాలు లేకుండా వాహనాలు నడిపినందుకు 342 కేసులు, సరైన పర్మిట్లు లేకుండా లేదా పర్మిట్ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనధికారికంగా ప్రైవేట్ వాహనాలలో ప్రయాణీకులను రవాణా చేసినందుకు 11 కేసులు నమోదు చేశారు. ఇలాంటి ఉల్లంఘనలు ప్రజల భద్రతకు విఘాతం కలిగిస్తూ, ప్రజా రవాణా సేవల సజావుగా సాగడానికి అడ్డంకులు సృష్టిస్తూ మరియు ట్రాఫిక్ జామ్‌లకు కారణమవుతున్నందున, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఇలాంటి చర్యలపై పూర్తి కఠిన వైఖరిని అవలంబిస్తోంది.మోటారు వాహనాల చట్ట నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయడానికి , హైదరాబాద్ నగరంలో సురక్షితమైన, క్రమశిక్షణతో కూడిన, ఇబ్బందులు లేని రవాణాను పెంపొందించడానికి ఇటువంటి ప్రత్యేక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించబడతాయి.

# రికవరీ చేసిన 30 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత.







**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 11 (పీపుల్స్ న్యూస్) :** మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని చార్మినార్ డివిజన్ ఏసీపీ పి. చంద్రశేఖర్ అన్నారు. చార్మినార్ డివిజన్ పరిధిలోని చార్మినార్ పోలీస్ సిబ్బంది సాంకేతిక దర్యాప్తు , కేంద్ర ప్రభుత్వ 'సీఈఐఆర్ ' (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను సమర్థవంతంగా ఉపయోగించి, వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న/చోరికి గురైన 30 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేశారు.శనివారం చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో, రికవరీ చేసిన ఈ 30 మొబైల్ ఫోన్లను ఆయన చేతుల మీదుగా ఆయా బాధితులకు, ఫిర్యాదుదారులకు అధికారికంగా అందజేశారు. వివిధ ప్రాంతాల్లో తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకుని, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితుల వివరాల ఆధారంగా చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నిరంతరం సాంకేతిక నిఘా ఉంచి, నిరంతర ఫాలో–అప్ తో వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. చార్మినార్ జోన్ ఏసీపీ పి. చంద్రశేఖర్ పర్యవేక్షణలో, ఇన్స్పెక్టర్ టి. రాంబాబు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కె. నర్సింగ్ రాథోడ్ ల మార్గదర్శకత్వంలో చార్మినార్ పిఎస్ డిటెక్టివ్ టీమ్ డీఎస్ఐ జి. సతీష్ రెడ్డి , క్రైమ్ టీమ్ సిబ్బంది కలిసి ఈ మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఫోన్లు రికవరీ చేసిన అధికారులను, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సూచిస్తూ.. లేదా కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్ లో వివరాలను నమోదు చేయాలని కోరారు. తద్వారా ఫోన్ త్వరితగతిన బ్లాక్ అవ్వడంతో పాటు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు

# ఆరోగ్య రక్షణ , వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడమే లక్ష్యం





**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో జూలై 11 (పీపుల్స్ న్యూస్) :** ఆరోగ్య రక్షణ , వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. నాగేశ్వరరావు తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ టి. శ్రీనివాస్ ల మార్గదర్శకత్వం, నిరంతర ప్రోత్సాహంతో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బంది కొరకు మ్యాక్స్ విజన్ హాస్పిటల్ సహకారంతో భారీ ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.సిటీ పోలీస్ విభాగంలో నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తమ విధులను చురుగ్గా, ఆరోగ్యంగా , శారీరక దృఢత్వంతో నిర్వహించేలా చూడటం, ముందస్తు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వైద్య శిబిరంలో సిబ్బందికి గుండె సంబంధిత పరీక్షలు (కార్డియాక్ హెల్త్ చెకప్), మ్యాక్స్ విజన్ నిపుణులచే అత్యాధునిక కంటి పరీక్షలు, రక్తపోటు (బి.పి), రక్తంలో చక్కెర స్థాయిల (బ్లడ్ షుగర్) పరీక్షలు, ఇతర సాధారణ ఆరోగ్య సమస్యల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న సిబ్బందికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, వైద్యులు తగు ఆరోగ్య సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. ఈ వెల్ఫేర్ హెల్త్ క్యాంప్‌లో మొత్తం 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ శిబిరం విజయవంతం కావడానికి ప్రోత్సహించిన డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఏసీపీ టి. శ్రీనివాస్ లతో పాటు వైద్య సేవలు అందించిన మ్యాక్స్ విజన్ హాస్పిటల్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నేరాల కట్టడికే కార్డెన్ సెర్చ్

**-చిట్యాల సీఐ దగ్గు మల్లేష్**

**-మాదకద్రవ్యాల దుర్వినియోగం చట్టరీత్యా నేరం**

**-మొగుళ్లపల్లి ఎస్ఐ ముప్పు సురేష్**



**చిట్యాల ప్రతినిధి జూలై 11 (పీపుల్స్ న్యూస్)**
నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని మేదరమెట్ల గ్రామంలో శనివారం తెల్లవారుజామున మొగుళ్ళపల్లి ఎస్ఐ ముప్పు సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో గ్రామంలోని ఇండ్లతో పాటు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. సోదాల సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి, పత్రాలు లేని వాహనాలకు జరిమా నాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ దగ్గు మల్లేష్ మాట్లాడారు. సమాజంలో పెనుభూతంగా మారిన మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించేందుకు ప్రజలు బార్డర్ లో సైనికుని వలె పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఐ ముప్పు సురేష్ మాట్లాడారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాల బారీన పడి బావి భారత జీవితాన్ని సర్వ నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల ఎస్ఐ, చిట్యాల సర్కిల్ పోలీసులు, టీజీఎస్పీ సిబ్బంది,యువకులు, విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు దక్కిన అరుదైన గౌరవం

**-జిల్లా స్థాయి ఉత్తమ ఏఎన్ఎంగా శ్రీలత**

**-జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న శ్రీలత**




**చిట్యాల ప్రతినిధి జూలై 11 (పీపుల్స్ న్యూస్)**
ఎంచుకున్న వృత్తిని దైవంగా భావించి..ప్రజలకు సేవ చేయడంలోనే దైవత్వం ఉందని, నిరంతరం ప్రజాసేవలో పునరంకితమైన ఏఎన్ఎం శ్రీలత మొగుళ్ళపల్లి మండల ప్రజలకు చేసిన సేవలకు గాను అత్యుత్తమ గౌరవం దక్కింది. శనివారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలోనే ఉత్తమ ఏఎన్ఎంగా అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా ఆమె ప్రశంసా పత్రాన్ని అందుకుంది. అనంతరం ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడారు. ప్రజలకు నిత్యం ఆరోగ్య సేవలను అందించడంలో తనకు వెన్నంటి ఉన్న కుటుంబ సభ్యులకు, తన సేవలను గుర్తించి తనకు ఈ అవార్డును అందజేసిన జిల్లా వైద్యాధికారులకు, తనకు ఎల్లవేళలా సహకరిస్తున్న ప్రజలకు, తనను ఎప్పటికీ ప్రోత్సహిస్తున్న తోటి హెల్త్ సూపర్వైజర్లకు, ఆశా వర్కర్లకు తనకు వచ్చిన అవార్డును అంకితం చేస్తానని తెలిపారు. ఇకముందు కూడా ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించేందుకు ఈ అవార్డు రావడం ఎంతో సహకరిస్తుందన్నారు.

# ములుగు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓగా ఎస్. వెంకటేష్ బాధ్యతల స్వీకరణ




**ములుగు, జిల్లా ప్రతినిధి జూలై 11 (పీపుల్స్ న్యూస్)**
ములుగు పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్. వెంకటేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2020 ఎస్సై బ్యాచ్‌కు చెందిన అధికారి కాగా, గతంలో పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి, బదిలీపై ములుగుకు వచ్చారు.
ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ స్థానంలో ఎస్. వెంకటేష్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అలాగే ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ములుగు పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది నూతన ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

## చేగుంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డిని పరామర్శించిన ఏఎంసీ చైర్మన్ తాడం వెంగల్ రావు



**చేగుంట జూలై 11**
చేగుంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి సతీమణి కోమండ్ల మంజుల ఇటీవల మృతి చెందగా, మండల అధ్యక్షుడు నారాయణరెడ్డిని పరామర్శించిన ఏఎంసీ చైర్మన్ తాడం వెంగల్ రావు. శనివారం ఇబ్రహీంపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంజుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తాడెం వెంగళరావు, ఇబ్రహీంపూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్,ఏఎంసీ డైరెక్టర్ స్టాలిన్ నర్సింలు, రెడ్డిపల్లి సర్పంచ్ నర్సింలు,అంజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థకు గ్రీన్ సిగ్నల్ - రాష్ట్రంలో మూడో డిస్కం సేవలు



**హైదరాబాద్:**తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్‌పీడీసీఎల్)కు విద్యుత్ నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈఆర్సీ ఆదేశాలతో రాష్ట్రంలో మూడో డిస్కం సేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను యథావిధిగా కొనసాగించాలని, మోటర్లకు మీటర్లు బిగించవద్దు అని కమిషన్ ఆదేశించింది. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది.విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు : ర్టంలో మూడో డిస్కం ఆవిర్భవించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్‌పీడీసీఎల్)కు విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) లైసెన్స్‌ను జారీచేసింది. తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్‌పీడీసీఎల్)కు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్?సీ) విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు చేసింది. ఉగాది పర్వదినం అయిన మార్చ్ 19న టీజీఆర్‌పీడీసీఎల్ లైసెన్స్ కోసం టీజీఆర్సీకి దరఖాస్తు చేసింది. ఈ లైసెన్స్ దరఖాస్తు పై మే 29న ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించింది. బహరంగ విచారణలో ఈఆర్?సీ రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వినియోగదారుల సంస్థలు, విద్యుత్ రంగ నిపుణులు తమ అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి, అందిన అన్ని అభిప్రాయాలను అంశాల వారీగా పరిగణనలోకి తీసుకుని కమిషన్ తన ఉత్తర్వుల్లో సమాధానాలు ఇచ్చింది.

నాలుగు నెలల తర్వాత వ్యాపార కార్యకలాపాలు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొత్త డిస్కం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, సంయుక్త రక్షిత తాగునీటి పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్?బీ), ప్రత్యేక పంపిణీ ట్రాన్స్ఫార్మర్ల ద్వారా విద్యుత్ పొందుతున్న మున్సిపల్ తాగునీటి కనెక్షన్లకు సేవలు అందిస్తుంది. ఈ ఉత్తర్వు తేదీ నుంచి నాలుగు నెలల తర్వాత టీజీఆర్?పీడీసీఎల్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమవ్వాలని కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 131 ప్రకారం చట్టబద్ధమైన ట్రాన్స్ఫర్ స్కీమ్?ను జారీ చేసిన తర్వాతే టీజీఆర్‌పీడీసీఎల్ లైసెన్స్ అమల్లోకి వస్తుంది.

ఆస్తులు, అప్పులు బదిలీ : విద్యుత్ చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం టీజీఎస్?పీడీసీఎల్?, టీజీఎన్‌పీడీసీఎల్ దాఖలు చేసిన దరఖాస్తులను కూడా కమిషన్ ఆమోదించింది. టీజీఆర్?పీడీసీఎల్ కార్యకలాపాలు ప్రారంభమైన తేదీ నుంచి బదిలీ అయ్యే వినియోగదారుల వర్గాలను ఈ రెండు డిస్కంల పరిధి నుంచి తొలగిస్తూ వాటి లైసెన్సులను సవరించింది. మిగతా వినియోగదారులకు సేవలు అందించే బాధ్యతలు, భౌగోళిక పరిధిలో ఎలాంటి మార్పు ఉండదుమార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేలా కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 131 ప్రకారం ట్రాన్స్ఫర్ స్కీమ్ జారీ చేసి సంబంధిత ఆస్తులు, అప్పులు, వినియోగదారులను టీజీఆర్?పీడీసీఎల్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే 2027–28 టారిఫ్ ఇతర డిస్కంల మాదిరిగానే : రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది. భవిష్యత్తులోనూ ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని ఈఆర్?సీ స్పష్టం చేసింది. వ్యక్తిగత వ్యవసాయ పంప్సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా కమిషన్ ఉత్తర్వుల్లో నమోదు చేసింది. టీజీఆర్?పీడీసీఎల్ కూడా ఇతర డిస్కంల మాదిరిగానే టారిఫ్, సేవా ప్రమాణాలు, వినియోగదారుల హక్కులు, నివేదికల సమర్పణ తదితర అన్ని అంశాల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి పర్యవేక్షణలో పనిచేస్తుంది. మార్పిడి ప్రక్రియను కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే ప్రజాహిత దృష్ట్యా మరిన్ని ఆదేశాలు జారీ చేస్తుంది.ప్రతిపాదనలను ఈ ఏడాది నవంబర్ 30లోపు సమర్పించాలి. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.ఇతర డిస్కంల మాదిరిగానే : రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది. భవిష్యత్తులోనూ ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని ఈఆర్?సీ స్పష్టం చేసింది. వ్యక్తిగత వ్యవసాయ పంప్సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా కమిషన్ ఉత్తర్వుల్లో నమోదు చేసింది. టీజీఆర్?పీడీసీఎల్ కూడా ఇతర డిస్కంల మాదిరిగానే టారిఫ్, సేవా ప్రమాణాలు, వినియోగదారుల హక్కులు, నివేదికల సమర్పణ తదితర అన్ని అంశాల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి పర్యవేక్షణలో పనిచేస్తుంది. మార్పిడి ప్రక్రియను కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే ప్రజాహిత దృష్ట్యా మరిన్ని ఆదేశాలు జారీ చేస్తుంది.

# కుటుంబాల్లోనే లింగ సమానత్వం ప్రారంభం కావాలి











**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో జూలై 11 (పీపుల్స్ న్యూస్) :**
కుటుంబాల్లోనే లింగ సమానత్వం ప్రారంభం కావాలని మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ చారు సిన్హా అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీలో ఉన్న వీ-హబ్ లో నిర్వహించిన ఐదో ప్యానెల్ చర్చా కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. కుటుంబాల్లో సమానత్వం, పరస్పర శ్రద్ధ, భావోద్వేగ నిజాయితీ -- లింగ సమానత్వం , పితృస్వామ్య ధోరణులు" అనే అంశంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ చారు సిన్హా పాల్గొని మాట్లాడుతూ పితృస్వామ్య భావజాలాన్ని మార్చేందుకు ప్రతి ఇంటిలో బహిరంగా మాట్లాడాలన్నారు. పరస్పర గౌరవం, భావోద్వే గాన్నీ నిజాయితిగా వ్యక్తపరచాలని పేర్కొన్నారు.విద్యా, సినీ, సామాజిక సేవ, మీడియా, పోలీసు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ వ్యవస్థలో నెలకొన్న లింగ వివక్ష, సామాజిక ఆచారాలు, భావోద్వేగ వ్యక్తీకరణ, సంరక్షణ బాధ్యతలు, మహిళలు--పురుషులకు లభించే అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమానత్వం, పరస్పర గౌరవం, అనురాగం, భావోద్వేగ నిజాయితీతో కూడిన కుటుంబాల నిర్మాణమే సమాజ మార్పుకు పునాది అని అభిప్రాయపడ్డారు, ఎవరూ రాయని ఒక నియమావళి ఉంది... కానీ అందరూ దానినే అనుసరిస్తున్నారు" అని పేర్కొన్నారు. కుటుంబాల్లో మహిళలు, పురుషులు ఎలా ఉండాలనే సామాజిక అంచనాలు రాతపూర్వకంగా లేకపోయినా తరతరాలుగా కొనసాగుతున్నాయని ఆమె అన్నారు. ఇలాంటి చర్చల ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగితే కుటుంబాల్లో మార్పు వస్తుందని, ఆ మార్పు సమాజాన్ని మరింత సమానత్వ దిశగా తీసుకెళ్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.హైదరాబాద్ విశ్వవిద్యాలయం , స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. సునీతా రాణి మాట్లాడుతూ "కుటుంబం బంధం కావాలి... బంధనం కాకూడదు" అని పేర్కొన్నారు. కుటుంబ సంబంధాలు స్వేచ్ఛ, సమానత్వం, భావోద్వేగ సంక్షేమాన్ని పెంపొందించేలా ఉండాలని, సంప్రదాయ లింగ వివక్షను కొనసాగించే విధంగా ఉండకూడదని ఆమె సూచించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, సినీ నిర్మాత, నటి సుప్రియా యార్లగడ్డ మాట్లాడుతూ వ్యక్తులపై సమాజం విధించే లింగ ఆధారిత పరిమితులు తొలగితే వారి నిజమైన ప్రతిభ, వ్యక్తిత్వం వెలుగులోకి వస్తుందని అన్నారు. కుటుంబాలు ప్రతి సభ్యుడికి స్వేచ్ఛగా ఎదిగే అవకాశాన్ని కల్పించాలని ఆమె సూచించారు.ప్లాంటేరియం వీగన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ దీపిక మాట్లాడుతూ, ముఖ్యంగా మహిళలు తమను తాము నిర్లక్ష్యం చేయకుండా ఆత్మ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. "ఇది స్వార్థంలా అనిపించినా... మిమ్మల్ని మీరు చివరి స్థానంలో పెట్టుకోకండి" అని ఆమె అన్నారు.ప్రముఖ దర్శకుడు శశి కిరణ్ తిక్క మాట్లాడుతూ, లింగ సమానత్వంపై పురుషులు కూడా బహిరంగంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. "ఈ విషయాలపై పురుషులు మాట్లాడాలి. మాట్లాడినప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.హైదరాబాద్ విశ్వవిద్యాలయం సామాజిక శాస్త్రాల విభాగం పరిశోధక విద్యార్థి అమన్ కుమార్ కుటుంబాల్లోనే లింగ పాత్రలు ఎలా ఏర్పడతాయో, తరతరాలకు ఎలా సంక్రమిస్తాయో సామాజిక శాస్త్ర దృక్కోణంలో వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ ఉమా సుధీర్ ఈ చర్చకు సమన్వయకర్తగా వ్యవహరిస్తూ భావోద్వేగ నిజాయితీ, సంరక్షణ బాధ్యతల భాగస్వామ్యం, కుటుంబాల్లో సమాన అవకాశాలపై అర్థవంతమైన చర్చను ముందుకు నడిపించారు.ఏడాది పొడవునా నిర్వహించే అవగాహన కార్యక్రమం. ప్రతి నెలా ఒక సామాజిక అంశంపై చర్చలు నిర్వహిస్తూ మహిళలు, పురుషులు కలిసి నిర్మాణాత్మక చర్చలు జరిపే వేదికను ఈ కార్యక్రమం కల్పిస్తోంది. లింగ సమానత్వంపై అవగాహన పెంచడం, పరస్పర అవగాహనను బలోపేతం చేయడం, సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ చర్చ ముగింపులో కుటుంబాలే పిల్లల్లో విలువలు, ఆలోచనలు, ప్రవర్తన రూపుదిద్దుకునే తొలి వేదిక అని ప్యానెల్ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబాల్లో పితృస్వామ్య ధోరణులను సవాలు చేయడం, భావోద్వేగాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వాతావరణం కల్పించడం, సంరక్షణ బాధ్యతలను సమానంగా పంచుకోవడం, పరస్పర గౌరవాన్ని పెంపొందించడం ద్వారా మాత్రమే సమానత్వం, సమగ్రత కలిగిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# మియాపూర్ ఫ్లైఓవర్, మైహోమ్ మంగళ ఆర్యుబి పనులను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్











**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 11 (పీపుల్స్ న్యూస్) :**
సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు, మైహోమ్ మంగళ రైల్వే అండర్ బ్రిడ్జ పనులను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జాతీయ రహదారి -65లో మియాపూర్ నుంచి అల్విన్ వరకు సర్వీస్ రోడ్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికను పరిశీలించారు. డైవర్షన్ అమలు సమయంలో వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్-XX శేషాద్రిని రెడ్డి, డీసీపీ ట్రాఫిక్-X ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్-XX టి. హనుమత్ రావు, ఏసీపీ మియాపూర్ ట్రాఫిక్ ఆది మూర్తి, మాధాపూర్ ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, అలాగే సీఎంసీ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అధికారులు పాల్గొన్నారు.






# ఫేక్ యూఎల్‌సీలతో ప్రభుత్వ భూమి కబ్జా...!

- హైడ్రాకే సవాల్ విసిరిన అక్రమ నిర్మాణం..!
- ప్రభుత్వ స్థలంలో క్లారియన్ హోటల్.

అధికారులకు బారీగా ముడుపులు.!

- యాంటి కరప్షన్ బ్యూరో నజర్ లో అధికారులు.



**శేర్లింగంపల్లి : జూలై 11 (పీపుల్స్ న్యూస్)**
ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హైడ్రాకే ఓ అక్రమ నిర్మాణం సవాల్ విసురుతోంది. ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా చిత్రీకరిస్తూ, కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని కబ్జా చేసిన వ్యవహారం శేర్లింగంపల్లి సర్కిల్‌లో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్లు 108, 110 లో ఉన్న సుమారు 3,751 గజాల ప్రభుత్వ భూమి అధికారుల సహకారంతో ఓ వ్యక్తి ఆధీనంలోకి వెళ్ళిపోయింది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ప్రైవేటు ఆస్తిగా చూపిస్తూ అక్రమ నిర్మాణాలకు మార్గం సుగమం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. 108, 110 సర్వే నంబర్లకు ఆనుకొని ఉన్న 111 నంబర్ గల ప్రైవేట్ ల్యాండ్ లో సదరు వ్యక్తికి స్థలం ఉంది. దానిని ఆధారంగా చేసుకుని దాని పక్కన ఉండే రెండు సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని మాయం చేశాడు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం హైడ్రా, రెవెన్యూ శాఖ, ఇతర ప్రభుత్వ యంత్రాంగాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్న సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు భూమి యాజమాన్యాన్ని ఎలా ధృవీకరించారు? ప్రభుత్వ స్థలం ప్రైవేటు భూమిగా ఎలా మారింది? ఈ ప్రక్రియలో ఎవరు సహకరించారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




## ఫేక్ యూఎల్‌సీ పత్రాలతో ప్రభుత్వ భూమి కబ్జా..?


ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ, కొందరు వ్యక్తులు మరియు అధికారుల కుమ్మక్కుతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం, సర్వే నంబర్ 111లోని ప్రైవేట్ భూమిని ఇప్పటికే 1980, 1983 సంవత్సరాల్లోనే విక్రయించినట్లు నమోదై ఉంది. అయినప్పటికీ, సర్వే నంబర్లు 108, 110లో ఉన్న సుమారు 3,751 గజాల ప్రభుత్వ భూమికి నకిలీ యూఎల్‌సీ పత్రాలు సృష్టించి, అధికారులతో కుమ్మక్కై భారీ విలువైన ప్రభుత్వ స్థలాన్నీ కబ్జా చేసి క్లారియన్ అనే పేరుతో భారీ హోటల్ నిర్మించారు. ఈ వ్యవహారం కారణంగా ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లగా, కొందరు అవినీతి అధికారులు మాత్రం భారీగా అక్రమంగా లబ్ధి పొందినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నకిలీ పత్రాల తయారీ, భూమి కబ్జా, అధికారుల పాత్రపై పూర్తి వివరాలు వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే యాంటీ కరప్షన్ బ్యూరో , విజిలెన్స్, రెవెన్యూ మరియు ఇతర దర్యాప్తు సంస్థలు ఈ కేసును స్వయంగా పరిశీలించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆదివారం, జూలై 12, 2026
పీపుల్స్ న్యూస్









# కట్టింది ఎన్ని.. కొట్టింది ఎన్ని..?

## పోలీస్ ఆర్మెడ్ స్థలమెక్కడ..!

## ఎస్ఐఆర్ సాకుతో కాలయాపన..?

## అధికారుల నిర్లక్ష్యం.. పేద ప్రజలకు శాపం.!

**కుత్బుల్లాపూర్ : జూలై 11 (పీపుల్స్ న్యూస్)** ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారుల వ్యవహారశైలిపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, అధికారులు కేవలం రెండు గదులను మాత్రమే తొలగించడం విమర్శలకు తావిస్తోంది.స్థానికుల కథనం ప్రకారం, గాజులరామారం పరిధిలోని సర్వే నెం. 307లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి, భారీగా మట్టి డంపింగ్ చేసి, వరుసగా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమగ్ర చర్యలు చేపట్టలేదని స్థానికులు అంటున్నారు. ఇటీవల అధికారులు చేపట్టిన చర్యల్లో కేవలం రెండు అక్రమ గదులను మాత్రమే తొలగించడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందనే కారణంతో అధికారులు కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి మొత్తం హద్దులను నిర్ధారించి, ఆక్రమణలను పూర్తిగా తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**పోలీసులకు కేటాయించినా.. భయపడని కబ్జా రాయుళ్లు..!**

గత ఏడాది భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు కొరడా ఝులిపించిన ప్రాంతంలో మరోసారి కబ్జా జరుగుతుంది. అప్పట్లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన పలువురిపై అధికారులు కేసులు నమోదు చేయగా, ఆక్రమణల నుంచి రక్షించిన ఆ స్థలాన్ని ప్రభుత్వం ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు విభాగానికి కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు.అయితే, ఒకవైపు కేసులు నమోదై ఉండటం, మరోవైపు ఆ స్థలం పోలీసు బలగాలకు కేటాయించినప్పటికీ కబ్జా రాయుళ్లలో ఎలాంటి భయం కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హైడ్రా అధికారులు వెళ్లిన కొద్ది రోజులకే అదే ప్రాంతంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు ప్రారంభమవడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోందని వారు అంటున్నారు.ప్రభుత్వ స్థలంలో మళ్లీ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు వెంటనే స్పందించకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని పోలీసు శాఖకు కేటాయించిన భూమిలో మళ్లీ ఆక్రమణలు ఎలా జరుగుతున్నాయో ప్రభుత్వం, రెవెన్యూ, హైడ్రా అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# సంపాదకీయం



# గందరగోళంగా సర్ ప్రక్రియ !

సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళు తుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

## వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి

## ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తాం

## సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను

## సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు



**వాషింగ్టన్,జూలై11:** అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్ పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడం తోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

# ప్రపంచ సమీకరణలు – చైనాపై పెరుగుతున్న విశ్వసనీయత!




ప్రపంచంలో ఏం జరుగుతోంది రోజువారీ పరిణామాలను చూస్తే సామాన్యులకు అనేక విషయాలు అంతుపట్టటం లేదంటే అతిశయోక్తి కాదు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయిల్ జరిపిన ఏకపక్ష దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా ఖమేని మరణించారు. తరువాత దాడులు కొనసాగిన కారణంగా అంత్యక్రియలను వాయిదా వేసి జూలై నాలుగు నుంచి తొమ్మిదవ తేదీ మధ్య పూర్తిచేశారు. ఈ క్రతువులో వందకుపైగా దేశాల నేతలు, ఉన్నతస్థాయి ప్రతినిధి వర్గాలు పాల్గొన్నట్టు వార్తలు. ఖమేని అంత్యక్రియల్లో పాల్గొనే దేశాలపై ప్రతీకా రం తీర్చుకుంటామని అమెరికా బెదిరించటంతో 13దేశాలు వెనక్కు తగ్గినట్లు చెబుతున్నారు. మనదేశం తరఫున విదేశాంగశాఖ ఉపమంత్రి పవిత్ర మార్గరిటా నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గం హాజరైంది. ఖమైనీ మరణానికి అధికారికంగా సంతాపం తెలిపితే ఎక్కడ అమెరికాకు కోపం వస్తుందోనని తటపటాయించిన మన కేంద్ర ప్రభుత్వం కొద్ది రోజుల తరువాత సంతాప ప్రకటన, ఇప్పుడు అంత్యక్రియల్లో పాల్గొన్నది. ఇరాన్ నేతలు, మిలిటరీ అధికారులు అందరూ ఒకేచోట దొరికినా తాము వారిని మట్టుబెట్టేందుకు పూనుకోలేదంటూ డోనాల్డ్ ట్రంప్ పిచ్చివాగుడుతో మరోసారి అమెరికా పరువు తీశాడు. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చి 250 సంవత్సరాలు గడిచిన సందర్భంగా మాట్లాడిన ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ "దేశానికి అతిపెద్ద ముప్పు కమ్యూనిజం" అని చెప్పాడు. ఇలాంటి వారందరినీ చరిత్ర చెత్తబుట్టలోకి నెట్టింది. అది వేరే విషయం. ఇండో–పసిఫిక్ ప్రాంతం నిబంధనల ప్రాతిపదికన స్వేచ్ఛగా ఉండాలంటూ జపాన్ ప్రధాని సానే తకాచీతో కలసి భారత్ ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. తన మిలిటరీ వ్యూహంలో భాగంగా మన భుజం మీద తుపాకిపెట్టి చైనాను కాల్చాలనుకున్నది అమెరికా. 1947లో ప్రారంభించిన అమెరికా పసిఫిక్ కమండ్ పేరును 2018లో ట్రంప్ నాయకత్వంలో యంత్రాంగం అమెరికన్ ఇండో–పసిఫిక్ కమాండ్‌గా మార్చింది. ఇపుడు అదే ట్రంప్ జూన్ నెలలో మనదేశం పేరును తొలగించి పాతపేరును పునరుద్ధరించాడు. మన చిత్రపటాన్ని మార్చి ఆక్రమిత్ కాశ్మీరును పాక్ ప్రాం తంగా దానిలో ముద్రించాడు. ఏ రెండు దేశాలైనా జతకట్టవచ్చని అది మూడో దేశానికి వ్యతిరేకంగా ఉండకూడదని మోడీ–తకాచీ భేటీ గురించి చైనా ప్రకటించింది. ఆ తరువాత తమకు వ్యతిరేకంగా ఎవరైనా పిచ్చివేషాలు వేస్తే సంగతి తేలుస్తామనే హెచ్చరికగా ఐదురోజుల కిందట చైనా జలాంతర్గాముల నుంచి ప్రయోగించే అణుక్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా జరిపింది. మార్చి నెల ఒకటవ తేదీ నుంచి మీడియాలో పశ్చిమాసియా సంక్షోభానికి పెద్ద పీటవేసి ఉక్రెయిన్ పరిణామాలను దాదాపుగా విస్మరించారు. తిరిగి ఈ వారంలో ఆ వార్తలు చోటు చేసుకున్నాయి. గత విశ్లేషణల్లో చెప్పినట్లుగా ఇరాన్‌పై అమెరికా దాడి ప్రపంచంలో నూతన పరిణామాలకు నాంది పలికింది. అనేక దేశాలు ఇప్పుడు విశ్వసనీయమైన దేశమేదంటే అమెరికా బదులు చైనాను ఎంచుకుంటున్నాయి. కమ్యూనిస్టు, బీజింగ్ వ్యతిరేకులకు ఇది మింగుడుపడని వ్యవహారం గనుక ఈ పరిణామాన్ని గుర్తించనట్లే వ్యవహరిస్తారు. అమెరికా రక్షణపై ఆధారపడిన గల్ఫ్ దేశాలు ఇటీవలి పరిణామాల తరువాత దానితో సంబంధాల గురించి వెంటనే బహిరంగంగా వెల్లడించకపోయిన ప్పటికీ పునరాలోచనలో పడ్డాయి. ఇదే విధంగా అమెరికా కనుసన్నలలో నడిచే నాటో కూటమిలోని ఐరోపా దేశాల పరిస్థితీ అదే. తమ రక్షణకు తామే ఆయుధాలు కొనుగోలు చేసి ఏర్పాట్లు చేసుకుంటు న్నపుడు అమెరికా పెత్తనం ఏమిటన్నది గతంలోనే కొందరు నేతలు ప్రశ్నించారు. ఇప్పుడు మరింతగా మధనం జరగనుంది. పసిఫిక్ కమాండ్ నుంచి ఇండో అనే పదాన్ని చేర్చటం–తొలగించటం ఒక సాధారణ వ్యవహారం కాదు. పేరు మార్పు చారిత్రాత్మక గుర్తిం పును పునరుద్ధరించటం తప్ప వేరు కాదని అమెరికా బుకాయిస్తున్నది. అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా దీని గురించి మరీ ఎక్కువగా ఆలోచించనవసరం లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ వ్యాఖ్యానించారు. అసలు విషయం ఏమంటే చైనాకు వ్యతిరేకంగా మనదేశాన్ని నిలిపేందుకు 2018లో అమెరికా వేసిన బిస్కెట్ ఇండో అనే పదాన్ని చేర్చటం. గత ఎనిమిది సంవత్సరాలుగా జరిగిన పరిణామాల్లో ఎలాంటి ప్రయోజనం లేదని గుర్తించిన అమెరికా కుంటిసాకుతో ఆ పేరును తొలగించింది. ఒక విధంగా ఇది మనలను బెదిరించటమే. మనదేశ పాలకవర్గానికి ఎన్నో అనుభవాలు ఉన్నాయి. సీతగీత దాటితే ఏమైందో తెలుసుగనుక చైనా వ్యవహారంలో కూడా అదే మాదిరి ప్రస్తుతం పరిధి దాటేందుకు సిద్ధం కాదు. తరువాత ఎలా మారేదీ ఊహాజనితమే. అమెరికన్ ఏజన్సీల తప్పుడు సమాచారం, ప్రోత్సాహంతో గాల్వన్ లోయ ఉదంతం జరిగిందన్నది ఒక అభిప్రాయం. ఐదేండ్ల తరువాత అదే చైనాతో సాధారణ సంబంధాలు నెలకొల్పుకోవటం వెనుక పాలకవర్గ ప్రయోజనాలు దాగున్నాయి. ఒక వైపు చైనాను వ్యతిరేకిస్తున్న జపాన్‌తో జట్టుకడుతూనే బీజింగ్ పెట్టుబడులకు తలుపులు తెరిచింది. ఇది దేశంలో డ్రాగన్ దేశ వ్యతిరేక శక్తులకు చెంపదెబ్బ వంటిది. గతంలో మాదిరి భారత పాలకవర్గం సోషలిస్టు–వ్యతిరేక శిబిరాల నుంచి లబ్ది పొందేందుకు ప్రయత్నించి నట్లే ఇప్పుడు కూడా అదే గేమ్ ఆడుతున్నది. విద్యుత్ రంగంలో చైనాతో సంబంధం ఉన్న నాలుగు కంపెనీల నుంచి టెండర్లను ఆహ్వానించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే శాశ్వతంగా అనుమతి ఇచ్చినట్లు కాదని పైకి బింకాలు పోతున్నప్పటికీ చైనా పెట్టుబడుల కోసం మనదేశం ఎంతగా తహతహలాడుతున్నది తెలుస్తోంది. గాల్వన్‌లోయ ఉదంతాల సమయంలో చైనా వ్యతిరేక మనోభావాలను రెచ్చగొట్టిన వారు ఇప్పుడు అన్నీ మూసుకు కూర్చున్నారు. నరేంద్రమోడీ నాయక త్వంలోని ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాలేవీ కూడా సైద్ధాంతికంగా కమ్యూనిస్టు అను కూలమైనవి కాదు. కానీ వాటికి చైనా వస్తువులు కావాలి. కార్పొరేట్లకు లాభాలు సంపాదించి పెట్టాలనటంలో ఏకాభిప్రా యం ఉంది. ఈ కారణంగానే చైనా దిగుమతుల్లో నరేంద్రమోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టుకుంటున్నారు. మనదేశం చెబుతున్న తాజా లెక్కల ప్రకారం ఇరుదేశాల వాణిజ్యలావాదేవీల విలువ 151 బిలియన్ డాలర్లు కాగా చైనా లెక్కలు 156బి.డాలర్లు అంటున్నాయి. ఇది పెద్ద సమస్య కాదు గానీ చైనాతో మన వాణిజ్యలోటు 112 బిలియన్ డాలర్లు దాటింది, ఇదొక రికార్డు. మన మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భరత నినాదాలు, ఆచరణ వైఫల్యానికి ఇది నిదర్శనం. కమ్యూనిస్టు చైనా విషయంలో భారత్ వైఖరిలో వచ్చిన మార్పు కారణంగానే పసిఫిక్ కమాండ్ పేరు మార్చారన్నది స్పష్టం. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పసిఫిక్ ప్రాంతంపై అదుపుకోసం కమ్యూనిస్టు చైనా ఆవిర్భవించక ముందే 1947 జనవరి ఒకటిన అమెరికా కమాండ్ ఏర్పడింది.

## రామకోటి రాస్తున్నారా- జపం పూర్తి చేసిన తర్వాత పుస్తకాలను ఏమి చేయాలి? ఈ నియమాలు తప్పక తెలుసుకోండి!



: శ్రీరామ నామం తారక మంత్రం. ఈ తారక మంత్రం గొప్పతనాన్ని సాక్షాత్తు పరమశివుడు పార్వతీదేవికి వివరిస్తూ 'తాను ఎల్లప్పుడూ రామ నామాన్ని జపిస్తూ ఉంటానని, 'రామ' అనే ఈ పవిత్రమైన రెండు అక్షరాల నామాన్ని జపించడం వల్ల కలిగే ఫలితం విష్ణు సహస్రనామాలను పఠించడంతో సమానమని తెలిపాడు. "రా", "మ" అనే రెండు అక్షరాలు అద్భుతమైన శక్తిని కలిగి ఉన్నాయి. 'రా' అనే అక్షరం అగ్ని బీజం ఇది అంతఃకరణను ప్రకాశింపజేసేది. 'మ' అనే అక్షరం అమృత బీజం. ఇది మనస్సుకు శాంతిని, ఆనందాన్ని కలిగిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. హిందూ సంప్రదాయంలో భగవంతుని చేరుకునే మార్గాల్లో 'రామకోటి' రాయడం కూడా ఒకటని అంటారు. ఇంతటి మహిమాన్వితమైన రామకోటి రాసేటప్పుడు ఎలాంటి నియమాలు పాటించాలి? రామకోటి పూర్తయ్యాక ఆ పుస్తకాలు ఏమి చేయాలి? అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

రామకోటి విశిష్టతరామకోటి రాయడానికి పూనుకోవడం ఒక సత్కార్యం. ఈ కార్యానికి కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుంది. 'శ్రీరామ' అని పదేపదే రాయడం మనసును శుద్ధి చేస్తుంది, అహాన్ని తొలగిస్తుంది. ఓర్పు, సహన గుణాలను పెంపొందిస్తుంది. రామకోటి రాయడంలో మనస్సును, బుద్ధిని, భక్తిని, చేతిని కేంద్రీకృతం చేస్తూ లిఖించడం వల్ల ఇది కూడా ఒక రకమైన జపం వంటిదే! రామకోటి రాయడానికి ఉన్న నియమాలేంటో చూద్దాం.రామకోటి రాయాలనుకుంటున్నారా! ఈ నియమాలు పాటించండి!రామకోటి రాయాలన్న మీ సంకల్పాన్ని ముందు దేవుడి దగ్గర మానసికంగా విన్నవించుకోండి. శ్రీరామ అని రాసే వీలున్న కోటి గళ్లతో ఉన్న పుస్తకం తెచ్చుకోండి.ఎప్పుడు మొదలు పెట్టాలి?

మంచి రోజు చూసుకుని రామకోటి పుస్తకానికి పసుపు, కుంకుమ రాసి దేవుని సన్నిధిలో ఉంచి పుష్పాలతో, శ్రీరామ అష్టోత్తర శతనామావళితో పూజించాలి. విశేషించి శ్రీరామ నవమి, ఉగాది, విజయదశమి, హనుమాన్ జయంతి రోజు నుంచి కానీ ప్రారంభిస్తే ఆటంకాలు లేకుండా రామకోటి పూర్తవుతుందని విశ్వాసం. రాయడం ప్రారంభించే ముందు శ్రీరామకోటి పుస్తకాన్ని భక్తితో కళ్లకు అద్దుకుని రాయడం ప్రారంభించాలి.మనసు కేంద్రీకరించాలి

రామకోటి రాసేటప్పుడు ఇతర వ్యాపకాలు, ఆలోచనలు పెట్టుకోకుండా ప్రశాంతమైన మనసుతో, మనసును బుద్ధిని కేంద్రీకరించి రాయాలి.శ్రీరామ నామ జపం

ఒక్కో నామం రాసేటప్పుడు 'శ్రీరామ' అని ఉచ్చరిస్తూ రాయడం వల్ల జపం చేసిన ఫలితం కలుగుతుంది.మధ్యలో ఆపవచ్చా!

అనుకోకుండా మధ్యలో ఏదైనా పని మీద వెళ్లవలసి వస్తే, సరి సంఖ్యలో రాయడం ఆపి పుస్తకం మూసి నమస్కరించి వెళ్లాలి. పని అయిపోయిన తర్వాత కాళ్లు , చేతులు ని శుచిగా మళ్లీ రాయడం మొదలు పెట్టాలి.

అన్ని ప్రత్యేకమే!రామకోటి రాసే పుస్తకం పూజామందిరంలో జాగ్రత్తగా ఉంచాలి. అందులో ఇతర విషయాలు ఏవీ రాయకూడదు. దానికి ఉపయోగించే కలాన్ని కూడా విడిగా ఉంచుకోవడం శ్రేయస్కరం.

ఏ సమయంలో రాయాలి?రామకోటి రాయడానికి ప్రత్యేకమైన సమయం అంటూ ఏదీ లేదు. కాని శుచి, శుభ్రత, పవిత్రత, ప్రశాంతత మాత్రం తప్పక పాటించాలి. ఏదో మొక్కుబడిగా పూర్తి చేయాలని కాకుండా ప్రశాంతమైన మనసుతో, సమయం అనుకూలించినప్పుడు మాత్రమే రా యాలి. వేగంగా చేయాలన్న తొందర వద్దు.అక్షర లక్షలుప్రతి లక్ష నామాలకు శ్రీరామునికి ప్రత్యేక పూజ, ఏదైనా తీపి పదార్థం నివేదన చేసి ఈ ప్రసాదాన్ని అందరికి పంచాలి.

రామకోటి యజ్ఞం పూర్తయిందా!

రామకోటి రాయడం పూర్తయిన తర్వాత మీ శక్తి అనుసారంగా శ్రీరాముని పూజలు, నివేదనలు అన్నదానం నిర్వహించడం మంచిది.

రామకోటి పుస్తకాలను ఏమి చేయాలి?

రామకోటి రాయడం పూర్తయిన తరువాత రామకోటి పుస్తకాలను ఒక పసుపు బట్టలో కట్టి భద్రాచలంలోని రామచంద్రుడికి కానీ, అయోధ్యలో రామాలయంలో కానీ సమర్పించాలి. వీలు కుదరని వారు తమ సమీపంలోని ఏదైనా రాముని గుడిలో కానీ, ఆధ్యాత్మిక సంస్థకు అప్పగించాలి. అదీ వీలుకాకుంటే గోదావరి, గంగ వంటి పవిత్ర నదులలో విడిచి పెట్టాలి.మహా యజ్ఞంశ్రీరామ కోటి లిఖించడం అనేది సామాన్య విషయం కాదు, ఇది ఒక పవిత్ర యజ్ఞం తో సమానం. ఈ రామనామ లిఖిత జపం వలన పూర్వ జన్మ కర్మలు తొలగిపోయి జీవితంలో సుఖసంతోషాలు, ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించవచ్చు. మనం కూడా ఈ రామకోటి యజ్ఞంలో పాల్గొని సకల శుభాలు పొందుదాం.జైశ్రీరామ్!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది మీ వ్యక్తిగత విషయం.

## అభిషేకం చేస్తే నీలిరంగులో మారే పాలు- రాహు దోషాలను తొలగించే నవగ్రహ క్షేత్రం- నాగనాథ స్వామి విశేషాలివే!





తమిళనాడులో నవగ్రహాలకు ప్రత్యేకంగా ఆలయాలు ఉన్న విషయం తెలిసిందే! నవగ్రహాల క్షేత్రాల దర్శనం వల్ల కొన్ని వేల జన్మల నుంచి పీడిస్తున్న గ్రహదోషాలు తొలగుతాయని పురాణాలు చెబుతున్నాయి. ఎందరో పురాణ పురుషులు ఈ నవగ్రహాల క్షేత్రాలను సందర్శించి గ్రహదోషాలు నుంచి విముక్తి పొందిన కథలు ఆధ్యాత్మిక గ్రంథాలలో కోకొల్లలుగా ఉన్నాయి.

**శాస్త్రీయ విజ్ఞానానికి అందని రహస్యాలు**

హిందూ సంప్రదాయం దేవీదేవతలతో పాటు నాగపాములకు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. మన పురాణాల్లో కూడా నాగ లోకం, నాగినీలు నాగదేవలు, నాగమణి ప్రస్తావన వినిపిస్తూనే ఉంటుంది. అయితే అవన్నీ ఒట్టి అభూతకల్పనలే అని కొట్టిపడేసే హేతువాదులు కూడా ఉన్నారు. అయితే శాస్త్రీయ విజ్ఞానానికి అందని వింతలు, శాస్త్రజ్ఞులు చెందించని రహస్యాలు ఉన్న దేవాలయాలు భారతదేశంలో ఎన్నో ఉన్నాయి.

**సైన్స్ కు అందని అద్భుతాలు మన ఆలయాలు**

ఎందరో శాస్త్రజ్ఞులు, ఎన్నో పరిశోధనలు చేసి కొన్ని ఆలయాలు సైన్స్ కు అందని అద్భుతాలు అని తేల్చి చెప్పిన విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి. అలాంటి ఆలయాల్లో ఒకటి రాహువు ఆలయం. రాహువుకు చెందిన ఈ ఆలయం నాగనాథస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. తమిళనాడులోని తొమ్మిది నవగ్రహ ఆలయాలలో ఒకటైన ఈ ఆలయం కుంభకోణం నగరం నుంచి తూర్పు దిక్కున 7 దూరంలో ఉన్న తిరునగేశ్వరంలో ఉంది.

**తిరునగేశ్వరం నాగనాథ ఆలయ విశేషాలు**

తిరునగేశ్వరం నాగనాథస్వామి ఆలయంలో పరమేశ్వరుడు నాగనాథస్వామిగా తన సతి గిరి గుజాంబికతో కలిసి వెలసి ఉన్నాడు. ఈ క్షేత్రంలో ప్రధాన దైవమైన నాగనాథస్వామికి ఇరువైపులా సరస్వతి, లక్ష్మీదేవి వెలసి విశేషం.

**భార్యలతో వెలసిన రాహువు**

తిరునగేశ్వరం నాగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక మందిరంలో వెలసిన రాహు భగవానుని దర్శించుకోవచ్చు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇక్కడ రాహువు ఇద్దరు భార్యలు నాగకన్ని, నాగవల్లితో కలిసి దర్శనమిస్తాడు. రాహువు ఒక శాపం నుంచి విముక్తి పొందటానికి ఈ ఆలయంలో శివుని పూజించాడని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. సాధారణంగా ఇతర నవగ్రహ దేవాలయాలలో రాహువు సర్ప ముఖంతో దర్శనమిస్తే, నాగనాధ్ స్వామి ఆలయంలో మాత్రం రాహువు మానవ ముఖాన్ని కలిగి ఉండటం విశేషం. జ్యోతిష్య శాస్త్రం రాకారం నాగ దోష పరిహారం చేసే ఒకే ఒక్క ఆలయంగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది.


**ఆకట్టుకునే చోళుల నిర్మాణ శైలి!**

ఈ ఆలయంలో రాహుభగవానుని విగ్రహం నైరుతి మూలలో ఉంది. ఆలయ ప్రాంగణంలో కొన్ని మండపాలు, బురుజుల గోపురాలు, ఎత్తైన ప్రాకారాలు ఉన్నాయి. చూడటానికి కోట గోడల్లా ఉండి, బయటి ప్రాకారాలతో కలిసి ఉన్న 4 ప్రవేశ బురుజులను చూడవచ్చు. దక్షిణం వైపున 4 మండపాలతో కూడి చుట్టూ రథం రూపంలో 100 స్థూపాల మండపం ఉన్న ఒక చెరువును చూడవచ్చు. ఈ ఆలయ నిర్మాణం చోళుల శైలిని పోలి ఉంటుంది.

**నీలిరంగులో మారే పాలు**


ఈ ఆలయంలో ప్రధానంగా పూజలందుకుంటున్నది రాహువు. నాగదోషంతో బాధపడేవారు రాహుకాలంలో రాహువు విగ్రహం మీద పాలు పోస్తే, అవి నీలి రంగులోకి మారి, కిందకు జారి పడిన తర్వాత మళ్ళీ తెల్లని పాల రంగులోకి మారతాయి. రాహు దోషం ఉన్నవారు, నాగ దోషం ఉన్నవారు ఈ ఆలయంలో రాహుకాలంలో రాహుభగవాన్ కి పాలాభిషేకం చేస్తున్నప్పుడు ఆ పాలు కంఠం నుంచి దిగగానే, గొంతు వద్ద నీలం రంగు గా మారుతుంది. అనంతరం ఆ పాలు నేలపై పడినప్పుడు తెల్లగా కావడం విశేషం. ఈ వింతను చూడడానికి రాహుకాలంలో భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. రాహువు విగ్రహంపై పోసిన పాలు నీలిరంగులోకి మారి ప్రతి ఒక్కరికి కనబడటం ఈ ఆలయం లోని ఒక ముఖ్య విశేషం.నాగమణినే కారణమా?ఇలా పాలు నీలి రంగులోకి మారడానికి నాగమణినే కారణమని పురాణాల కథనం. విష్ణు పురాణం, గరుడ పురాణంలో కూడా ఈ నాగమణి ప్రస్తావన ఉంది.ఎలా చేరుకోవాలి?ఎంతో మహిమాన్వితమైన ఆలయాన్ని దర్శించుకోవడానికి వెళ్లాలంటే శనివారం ఉదయం 9 గంటల నుంచి 10:30 లోపు కానీ, ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6:30 మధ్యలో కానీ వెళ్లాలి. కుంభకోణం వరకు దేశంలో అన్ని ప్రాంతాల నుంచి రైలు సౌకర్యాలున్నాయి. అక్కడ నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరునగేశ్వరం ఆలయానికి సులభంగా చేరుకోవచ్చు.మనం కూడా తిరునగేశ్వరం ఆలయాన్ని సందర్శించి సకల గ్రహ దోషాలు నుంచి విముక్తి పొందుదాం.ఓం రాహవే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే

## జుట్టు ఎక్కువగా రాలిపోతోందా - ఈ ఆయుర్వేద చిట్కాలు మేలు చేస్తాయట!



కేవలం అనారోగ్య సమస్యలకు పరిష్కారాలు మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాన్ని కూలంకశంగా పేర్కొంది ఆయుర్వేద శాస్త్రం. కేవలం ఆరోగ్య పరంగా మాత్రమే కాదు జుట్టు సమస్యలకు ఆయుర్వేదంలో చికిత్సలు ఉన్నాయి. ఈ క్రమంలోనే జుట్టు రాలడం తగ్గి, ఒత్తుగా, పొడవుగా పెరగడానికి ఉపయోగపడే కొన్ని ముఖ్యమైన ఆయుర్వేద చిట్కాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!నూనెతో మసాజ్ : క్రమం తప్పకుండా తలను నూనెతో మసాజ్ చేయడం అనేది ఆయుర్వేదంలో అత్యంత ఉత్తమమైన అలవాటు. దీని వల్ల జుట్టుకే కాకుండా మొత్తం శరీరానికి, మనస్సుకు ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొబ్బరి, నువ్వులు లేదా బాదం నూనెతో మసాజ్ చేయడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగవుతుందని చెబుతున్నారు. ఫలితంగా, కుదుళ్లకు అవసరమైన పోషకాలు అంది, జుట్టు రాలడం తగ్గిపోతుందని పేర్కొంటున్నారు. అలాగే, జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం లాంటి సమస్యలు తగ్గుతాయని తెలియజేస్తున్నారు. కొబ్బరి నూనె వెంట్రుకలపై ఒక రక్షణ పొరను ఏర్పరిచి, క్యూటికల్ (వెంట్రుక పైపొర)ను మూసివేయడం ద్వారా హెర్బల్ హెయిర్ రిన్స్ : తలస్నానానికి శీకాకాయ్, కుంకుడుకాయలు, ఉసిరికాయ వంటి సహజ పదార్థాలను ఉపయోగించడం వల్ల స్కాల్ప్ ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి స్కాల్ప్ జూం స్థాయిని సమతుల్యం చేయడానికి, చుండ్రును నియంత్రించడానికి సహాయపడతాయని అంటున్నారు. అంతేకాదు, కురులను సహజంగా మృదువుగా, ఆరోగ్యంగా ఉంచుతాయట.సమతులాహారం, నీరు : విటమిన్లు, ఖనిజాలు, ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగడం వల్ల జుట్టుకు లోపలి నుంచి పోషణ అందుతుందని నిపుణులు చెబుతున్నారు. గింజలు, విత్తనాలు, ఆకుకూరలు, పండ్ల వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల జుట్టు దృఢంగా ఉంటుందని అంటున్నారు. అలాగే, చిన్నవయసులోనే జుట్టు తెల్లబడకుండా ఉంటుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల జుట్టు మందం, స్థితిస్థాపకతకు తోడ్పడుతుందని వివరిస్తున్నారు.డ్రైయర్ వద్దు : హీట్ స్టైలింగ్ పరికరాలు జుట్టును తాత్కాలికంగా అందంగా మార్చినప్పటికీ, తీవ్రచెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, మైన వేడివల్ల జుట్టులోని సహజ తేమ, కెరాటిన్ ప్రొటీన్ దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం, విపరీతంగా రాలిపోతుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, తలస్నానం చేసిన తర్వాత జుట్టును ఫ్యాన్చెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, ? గాలికే ఆరనివ్వాలని సూచిస్తున్నారు. హెయిర్ డ్రయర్ వాడడం హెయిర్ స్టైల్స్ : జుట్టును బిగుతుగా లాగి వివిధ హెయిర్? స్టైల్స్ వేసుకోవడం వల్ల కుదుళ్లు బలహీనపడతాయ ట. దీంతో జుట్టు ఎక్కువగా రాలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే, ఇంట్లో ఉన్నప్పుడు లేదా రాత్రి పడుకునే ముందు జుట్టును లూజ్?గా జడ వేసుకోవడం చాలా మంచిదని అంటున్నారు. ఇది జుట్టు చిక్కుబడకుండా, రాలిపోకుండా చేస్తుందని తెలియజేస్తున్నారు.తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ : నిద్ర, మానసిక ప్రశాంతత అనేవి కేవలం ఆరోగ్యానికే కాదు, ఒత్తుగా పెరిగే జుట్టుకు కూడా అత్యంత ముఖ్యమంటున్నారు నిపుణులు . మానసిక ఒత్తిడి పెరిగినప్పుడు శరీరంలో కార్టిసాల్ స్థాయిలు పెరుగుతాయట. ఇవి జుట్టు కుదుళ్లను బలహీనపరచడం, జుట్టు రాలడానికి, తెల్లబడటానికి కారణమవుతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, లోతైన శ్వాస వంటి పద్ధతులు ఒత్తిడి వల్ల జుట్టు రాలిపోవడాన్ని తగ్గిస్తాయని సూచిస్తున్నారు. అలాగే, సాధారణ ఆరోగ్యాన్ని మెరుగుపరుసాయని సలహా ఇస్తున్నారు.సూర్యరశ్మి నుంచి రక్షణ : సూర్యుడి నుంచి చ్చే అతినీలలోహిత కిరణాలు జుట్టులోచెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, ని కెరాటిన్ ప్రొటీన్?ను దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. దీంతో జుట్టు పొడిబారడం, రంగు మారిపోవడం, చిట్లిపోతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో జుట్టుకు నూనెను రాసుకోవడం, టోపీలు లేదా స్కార్ఫ్?లు ధరించడం వల్ల కురులకు యూవీ కిరణాల నుంచి రక్షణ లభిస్తుందని సూచిస్తున్నారు. తద్వారా జుట్టు రంగు మారకుండా ఉంటుందని ఎచెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, లహా ఇస్తున్నారు.చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## "మైక్రో హ్యాబిట్స్" ట్రై చేస్తారా? - ఆరోగ్యకరమైన జీవనశైలికి హెల్ప్? అవుతాయట!



మనం ఒకే రోజులో కొండను తవ్వలేం కానీ, రోజూ ఒక చిన్న రాయిని తీసి పక్కన పడేయవచ్చు కదా. మైక్రో హ్యాబిట్స్ కూడా సరిగ్గా ఇదే చేస్తాయి. దీనివల్ల వచ్చే ఫలితాలు కూడా అలాగే ఉంటాయట. ఈ చిన్న అలవాట్లే భవిష్యత్తులో పెద్ద లక్ష్యాలను సాధించడానికి తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి, దీర్ఘకాలిక లక్ష్య సాధనకు ఇవి ప్రేరణగా నిలుస్తాయట. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!

ఉదయం నిద్రలేవగానే బెడ్ సర్దుకోవడం : చాలామంది దీనిని ఒక చిన్న పనిగా భావిస్తారు. కానీ, ఇది మెదడుపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తుందంటున్నారు నిపుణులు. నిద్ర లేచిన వెంటనే బెడ్?ను నీట్?గా సర్దడం వల్ల, రోజు ప్రారంభంలోనే ఒక పనిని విజయవంతంగా పూర్తి చేశారనే భావన కలుగుతుందని చెబుతున్నారు. ఇది మెదడుకు ఒక పాజిటివ్ సిగ్నల్?ను పంపి, రోజంతా మిగిలిన పనులను కూడా క్రమశిక్షణతో పూర్తి చేయడానికి ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొంటున్నారు.

కళ్ల కింద డార్క్ సర్కిల్స్ వచ్చాయా - ఈ టిప్స్ పాటిస్తే బెటర్ అంటున్న ఎక్స్పర్ట్స్?!

వ్యాయామం : పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఎవరికైనా ఆరోగ్యం ఎంతో అవసరం. కొందరైతే గంట వ్యాయామం చేయాలని తీర్మానించుకుంటారు. కానీ, రెండు రోజులు చేసి మూడో రోజు ఆపేస్తారు. ఇలాంటప్పుడు తక్కువ సమయంలో 10 నిమిషాల పాటు నడవడం అలవాటు చేసుకోవాలంటున్నారు నిపుణులు. ఆ తర్వాత మెల్లగా సమయాన్ని పెంచుకుంటూ వెళ్లొచ్చని సూచిస్తున్నారు.

మంచినీళ్లు : మనలో చాలా మంది మంచినీళు తాగడాన్నీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్త ఆకలిగా అనిపించగానే ఏదైనా తినాలని అనుకుంటారు. కానీ, నీళ్లు తాగాలని మాత్రం ఆలోచించరు. అలాగే, కాఫీ/టీ, కూల్?డ్రింకులు తాగాలనిపించినప్పుడు నీళ్లు తాగుతుండాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో మిగతా పానీయాలను నియంత్రించడంతో పాటు సరిపడినన్ని నీళ్లు తీసుకోవచ్చని సలహా ఇస్తున్నారు. అలాగే ఏకాగ్రత కుదరనప్పుడు, అలసటగా, చిరాగ్గా అనిపించినప్పుడు కాసిన్ని నీళ్లు తాగితే మంచిదని పేర్కొంటున్నారు.

ఎక్కువసేపు కూర్చుని పనిచేసేటప్పుడు : ఆఫీస్ పనిలో లేదా చదువులో పడి గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల వెన్నునొప్పి, మెడనొప్పి, బద్ధకం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గంటకు ఒకసారి కాసేపు నడవడం మంచిదని సూచిస్తున్నారు. లేకుంటే చేతులను పైకి చాచడం, మెడను తిప్పడం లేదా కాస్త ముందుకు వంగడం వంటి సాధారణ స్ట్రెచింగ్స్ చేయాలని సలహా పెంచి, అలసటను దూరం చేస్తుందంటున్నారు. తెలియజేస్తున్నారురాత్రి పడుకునే ముందు : చాలామంది ఉదయం లేవగానే ఈ రోజు ఏం చేయాలి అని ఆలోచిస్తూ, సమయాన్ని వృథా చేస్తుంటారు. అందుకే, పడుకునే ముందు ఒక రాయాలంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల మెదడులోని ఒత్తిడి తగ్గి, రాత్రి ప్రశాంతంగా నిద్ర పడుతుందని చెబుతున్నారు. మరుసటి రోజు ఉదయం ఏం చేయాలనే స్పష్టత ఉంటుందని సూచిస్తున్నారు

# పారదర్శకంగా పద్మశాలి పంచాయతీల నిర్వహణకు తీర్మానం

**కాగజ్‌నగర్, జూలై 11,** :సమాజంలో నెలకొనే వివాదాలను సామరస్యపూర్వకంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కమిటీ విధివిధానాలపై శనివారం కాగజ్‌నగర్‌లో సమావేశం నిర్వహించారు.స్థానిక పద్మశాలి భవనంలో సాయంత్రం జరిగిన సమావేశానికి పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుల్లపెల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వడ్నాల వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కమిటీ సభ్యుల అభిప్రాయాలను సేకరించి, భవిష్యత్తులో పంచాయతీల నిర్వహణకు అనుసరించాల్సిన విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఇరువర్గాల సమ్మతితో డిపాజిట్ విధానాన్ని అమలు చేసి, గౌరవ పంచాయతీ కమిటీ సభ్యుల సమక్షంలో నిష్పాక్షికంగా, పారదర్శకంగా పంచాయతీలు నిర్వహించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమాజంలో ఐక్యత, పరస్పర అవగాహన పెంపొందేలా ప్రతి వివాదాన్ని చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పరిష్కరించే దిశగా కమిటీ పనిచేయాలని నిర్ణయించారు.సమాజ ప్రయోజనాలు, సామాజిక ఐక్యతను కాపాడడం ప్రతి సభ్యుడి బాధ్యత అని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. పద్మశాలి కుల బాంధవులంతా సంఘ నిర్ణయాలకు సహకరించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.




# ఆరుగురి హత్య కేసు.. నిందితుడిపై రూ.2లక్షల రివార్డు



**రంగారెడ్డి :జూలై 11,** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని దైవాలగూడలో ఆరుగురి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు రాజ్ కుమార్ ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. హత్యల అనంతరం నిందితుడు సెల్ఫ్ డ్రైవ్ రెంటల్ కారులో పరారయ్యాడు. అతడి కోసం 10 ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, టోల్ ప్లాజా వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు.

# జులై 13 వందేళ్లకు ఒకసారి వచ్చే రోజు



**హైదరాబాద్ జూలై 11,** :జూలై 13న అత్యంత అరుదైన మహాశైవాక్షయోగం ఏర్పడుతోంది.వందేళ్లకోసారి వచ్చే ఈ రోజున శివారాధన చేయడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయని పురోహితులు చెబుతున్నారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేయడం వల్ల సకల పాపాలు తొలగి,సుఖసంతోషాలు చేకూరుతాయని సూచిస్తున్నారు. భక్తితో చేసే చిన్న పూజ కూడా శివుడి అనుగ్రహాన్ని కలిగిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వివరిస్తున్నారు.

# భూమి అడవి సహజ వనరుల రక్షణకై ఉద్యమించండి

**- ఆదివాసుల జీవనాదారము పొడుభూములు.**
**అడవి హక్కుల కై ఉద్యమించండి**
**- జల్ జంగిల్,జమిన్ హమారా హై.**
**- ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షులు కోవా దౌలత్ రావు మోకాశి**

**ఉమ్మడి ఆదిలాబాద్ :జులై 10,**:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసులు ఎదుర్కొంటున్న భూమి అడవి సహజ వనరులు దోపిడీకి వ్యతిరేకంగా వాటి రక్షణకై సమస్త అదివాసులు సన్నద్ధమై ఉద్యమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవా దౌలత్ రావు మోకాశి పిలుపునిచ్చారు. ములుగు జిల్లా ఎస్.ఎస్ తాడ్వాయి మండలం, మేడారం కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర ఆదివాసి సేన విస్తృతస్థాయి సమావేశాలు జూలై 11, 12 నిర్వహించడబడును.ఆదివాసి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడి సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య వక్తగా హాజరైన ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవా దౌలత్ రావు మోకాశి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో అనేక సమస్యలు ఆదివాసులు ఎదుర్కొంటున్నారని ప్రత్యేకించి భూమి- అడవి- సహజ వనరుల దోపిడీ జరుగుతుందని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజ నేతరులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగస్వామ్యం కల్పించవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ బదలాయింపు నిరోధక ఎల్ టి ఆర్




చట్టం, అటవీ హక్కుల చట్టం-2006, పెసా చట్టం పటిష్ట అమలుకు సేన కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర నాయకులు మడి సాయిబాబు, గుండు శరత్, సోడే వెంకటేశ్వర్లు, పొడెం సమ్మయ్య, రాయిసిడం జంగూ పటేల్, చింత అరుణ, వజ్జ జ్యోతిబసు, ఊకె రవి, ఆలం శ్రీను, కోర్సా నరేష్, కల్తి నరేష్, రామస్వామి, యానక లక్ష్మీనారాయణ, శెట్టిపల్లి శీను, పోలేబోయిన ఆదినారాయణ, కల్తీ మధుసూదన్ రావు, కాక సురేష్, బొల్లి శ్రీనివాస్, మూత లక్ష్మి, కల్తి రమేష్, అదిలాబాద్,అసిఫాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లా ప్రతినిధులుతదితరులు పాల్గొన్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


# రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు..!!



**తెలంగాణ : జూలై 11, :** రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు:
ఉద్దేశపూర్వకంగా అలా పొంది ఉంటే శిక్ష, జరిమానా.. ఓటర్లంతా 'సర్'లో పాల్గొని ఓటుహక్కును రక్షించుకోవాలి.. ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి ఇవ్వాల్సిందే
ముఖ్యమంత్రికైనా, ప్రధానికైనా మినహాయింపు లేదు ఎన్యూమరేషన్ ఫారం అందకుంటే.. ఫారం-6 ఇవ్వచ్చు గ్రామాల్లో వేగంగా 'సర్'.. పట్టణాల్లో చిరునామా సమస్య
బీఎల్వోలకు అవగాహన లేకనే ఫారాల పంపిణీ ఆలస్యం తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్‌రెడ్డి వెల్లడి

# మధ్యాహ్నం సమయంలో చిన్న కునుకు తీస్తే మంచిదేనా.. వైద్యులు ఏం చెబుతున్నారు..

మధ్యాహ్నం కాసేపు కునుకు తీస్తే శరీరం, మెదడు తాజాగా మారుతాయని చాలామంది భావిస్తారు. అయితే కొందరికి నిద్ర లేచిన వెంటనే మరింత అలసటగా, అయోమయంగా లేదా నీరసంగా అనిపిస్తుంది. ఇది సాధారణ విషయమేనని, దీనికి స్లీప్ ఇనర్షియా అనే ప్రక్రియ కారణమని నిపుణులు చెబుతున్నారు. మన నిద్ర తేలికపాటి నిద్ర, గాఢ నిద్ర వంటి పలు దశల్లో సాగుతుంది. రాత్రి నిద్రలో ఈ దశలు పూర్తయ్యాక మెదడు క్రమంగా మేల్కొనేందుకు సిద్ధమవుతుంది. కానీ మధ్యాహ్నం కునుకు తీసుకునే సమయంలో అనుకోకుండా గాఢ నిద్ర దశలోనే మేల్కొంటే, మెదడు ఒక్కసారిగా మేల్కొనే పరిస్థితికి సిద్ధంగా ఉండదు. దీంతో శరీరం, మెదడు తాత్కాలికంగా స్పందించడానికి కొంత సమయం తీసుకుంటాయి.
ఈ లక్షణాలు కనిపిస్తాయి..ఈ సమయంలో నిద్ర లేచిన వెంటనే మత్తుగా అనిపించడం, అయోమయం, తల తిరిగిన భావన, ఏ రోజు అనేది కూడా క్షణికంగా గుర్తు రాకపోవడం వంటి



లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి చెమటలు పట్టడం కూడా జరుగుతుంది. ఎందుకంటే నిద్ర నుంచి మెలకువకు మారే సమయంలో గుండె వేగం, రక్తప్రసరణ, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థలు ఇంకా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకోకపోవడమే ఇందుకు కారణం. ఈ సమస్యను నివారించాలంటే కునుకు సమయంపై శ్రద్ధ పెట్టడం అవసరం. నిపుణుల సూచనల ప్రకారం, 10 నుంచి 20 నిమిషాలపాటు మాత్రమే కునుకు తీస్తే గాఢ నిద్ర దశలోకి వెళ్లే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో మేల్కొన్న తర్వాత తాజాగా అనిపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.నిద్ర చక్రాన్ని పూర్తి చేయాలి..మరొక మార్గం 90 నిమిషాల పూర్తి నిద్ర చక్రాన్ని పూర్తి చేయడం. అయితే 40 నుంచి 50 నిమిషాల వంటి మధ్యస్థ వ్యవధిలో నిద్ర లేవడం వల్ల గాఢ నిద్ర మధ్యలో మేల్కొనే అవకాశం ఉండటంతో అలసట, మత్తు ఎక్కువగా అనిపిస్తాయి. అందువల్ల కునుకు తీయడం తప్పు కాదు. అయితే సరైన సమయం పాటు మాత్రమే నిద్రపోవడం, గాఢ నిద్ర దశలో మేల్కొనకుండా చూసుకోవడం ద్వారా నిద్ర లేచిన తర్వాత వచ్చే అలసట, అయోమయాన్ని చాలా వరకు నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.


# వైభవంగా యాదాద్రి నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం



**యాదగిరిగుట్ట హైదరాబాద్ జూలై 11** :నరసింహ స్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం రోజున స్వామివారి సన్నిధిలో అత్యంత వైభవంగా జరిగింది ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆలయ చైర్మన్ అలాగే ఆలయ ధర్మకర్తలకు పలువురు ప్రముఖులు ఘనంగా శుభాకాంక్షలు తెలియ జేశారు నూతన పాలకవర్గాన్ని కర్మాన్ ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ డైరెక్టర్ పూల నాగరాజు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోగుతాళ విజయ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారికి శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు అందజేశారు ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులు గజ్జల రంజిత్ దాసరి నరేష్ తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి తమ అభినందనలు తెలియజేశారు

# బరువు తగ్గాలని గంటల తరబడి కార్డియో చేస్తున్నారా..


బరువు తగ్గాలంటే తప్పనిసరిగా గంటల తరబడి కార్డియో చేయాలనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. పరుగెత్తడం, సైక్లింగ్ చేయడం లేదా ట్రెడ్‌మిల్‌పై ఎక్కువ సమయం గడపడం వల్లే బరువు తగ్గుతుందని భావిస్తుంటారు. అయితే ఫిట్‌నెస్ నిపుణులు ఇప్పుడు ఈ ఆలోచన పూర్తిగా సరైంది కాదని చెబుతున్నారు. కార్డియో ఆరోగ్యానికి ఉపయోగకరమైన వ్యాయామమే అయినప్పటికీ, బరువు తగ్గడానికి అది ఒక్కటే పరిష్కారం కాదని వారు సూచిస్తున్నారు. కార్డియో వ్యాయామం చేసే సమయంలో శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తుంది. అయితే ఒకే రకమైన కార్డియోను ప్రతిరోజూ అదే స్థాయిలో చేస్తుంటే, కొంతకాలానికి శరీరం దానికి అలవాటు పడుతుంది. దీంతో మొదట్లో కనిపించినంత ప్రభావం తర్వాత ఉండదు. అలాగే అతిగా కార్డియో చేయడం వల్ల అలసట, ఒత్తిడి పెరగడం, కండరాల దృఢత్వం తగ్గడం వంటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంటుంది.ఎ××ు చేయాలి..ఇలాంటి పరిస్థితుల్లో కండరాల బలాన్ని పెంచే స్ట్రెంత్ ట్రైనింగ్‌పై దృష్టి పెట్టడం మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేస్తున్నప్పుడు మాత్రమే కాకుండా, కండరాల పరిమాణం పెరిగిన తర్వాత విశ్రాంతి సమయంలో



కూడా శరీరం ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేస్తుంది. దీంతో శరీరంలోని కొవ్వు తగ్గడమే కాకుండా, శరీరాకృతి కూడా మెరుగుపడుతుంది. కేవలం బరువు తగ్గడం కాకుండా శరీరం మరింత బలంగా, ఫిట్‌గా మారుతుంది. హై-ఇంటెన్సిటీ ఇంటర్వల్ ట్రైనింగ్ కూడా బరువు తగ్గడంలో సమర్థవంతమైన వ్యాయామంగా గుర్తింపు పొందుతోంది. ఇందులో తక్కువ సమయం పాటు అధిక తీవ్రతతో వ్యాయామం చేసి, మధ్యలో స్వల్ప విరామం తీసుకుంటారు. ఈ విధానం వల్ల తక్కువ సమయంలోనే మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది.

గంటసేపు కార్డియో చేయాల్సిన అవసరం లేకుండా, 20 నుంచి 30 నిమిషాల పాటు సరైన ప్రణాళికతో చేసిన ఎ××ు వ్యాయామం కూడా ప్రభావవంతంగా ఉంటుంది.ఒకే రకమైన వ్యాయామం వద్దు..బరువు తగ్గడంలో కేవలం ఒకే రకమైన వ్యాయామంపై ఆధారపడకుండా, శరీరాన్ని అన్ని విధాలుగా దృఢంగా తీర్చిదిద్దే విధానాన్ని అనుసరించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కండరాల బలం, శరీర వంచుకునే సామర్థ్యం, స్టామినా, మానసిక ఆరోగ్యం వంటి అంశాలన్నింటిపైనా సమానంగా దృష్టి పెట్టాలి. శరీరం ఎక్కువకాలం కొనసాగించగలిగే వ్యాయామ ప్రణాళికను ఎంచుకోవడం ముఖ్యం. అయితే దీని అర్థం కార్డియో అవసరం లేదని కాదు. గుండె ఆరోగ్యం మెరుగుపరచడంలో, శ్వాసకోశ సామర్థ్యాన్ని పెంచడంలో, స్టామినా పెంపొందించడంలో కార్డియో ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ బరువు తగ్గడానికి దానిపైనే పూర్తిగా ఆధారపడితే ఆశించిన ఫలితాలు రావు. స్ట్రెంత్ ట్రైనింగ్, ఎ××ు, అవసరమైన స్థాయిలో కార్డియో వ్యాయామం, సమతుల్యమైన పోషకాహారం ఈ నాలుగు అంశాలను కలిపి పాటిస్తే బరువు తగ్గడంలో మెరుగైన ఫలితాలు పొందవచ్చు. అంతిమ లక్ష్యం కేవలం సూచిస్తున్నారు.

# ప్రముఖ దిగ్గజ నేపథ్య గాయని ఎస్. జానకి కన్నుమూత



**కర్ణాటక : జూలై 11,** మైసూరులోని అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో మృతి "దక్షిణ భారత కోకిల"గా ఎస్. జానకికి ప్రత్యేక గుర్తింపు1938 ఏప్రిల్ 23న జన్మించిన ఎస్. జానకిఆరు దశాబ్దాలకు పైగా సినీ గాన సేవ17 భాషల్లో 48 వేల కుపైగా పాటలు ఆలపించిన గానకోకిలమధురమైన గాత్రంతో కోట్లాది అభిమానుల మనసు గెలుచుకున్న జానకిగ్రామీణ జానపదం నుంచి శాస్త్రీయ, మెలోడీ, భక్తి గీతాల వరకు విశేష ప్రతిభభారతీయ సినీ సంగీత రంగానికి ఎస్. జానకి సేవలు చిరస్మరణీయంఎస్. జానకి మృతితో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో విషాదం
గానకోకిల ఎస్. జానకికి సినీ, సంగీత ప్రముఖుల నివాళులు.

ఆదివారం, జూలై 12, 2026 | పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# జనాభా నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి

**• ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా**

**సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**




**కర్నూలు జూలై 11:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం దిన్నదేవరపాడులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో జనాభా నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, జనాభా నియంత్రణ కంటే జనాభా నిర్వహణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వనరుల సమతుల్యతను కాపాడడం, యువశక్తిని పరిరక్షించడం జనాభా నిర్వహణ ప్రధాన లక్ష్యమని తెలిపారు.రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరైన జనాభా నిర్వహణ విధానాలు అవసర మని పేర్కొన్నారు. జనాభా పెరుగుదలతో పాటు నిరుద్యోగం, పేదరికం, పర్యావరణ సమస్యలు, వనరుల కొరత వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి నిర్మల, అధ్యాపకులు, సెట్కూరు జూనియర్ అసిస్టెంట్ సంక్రు బాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలి



**కర్నూలు జూలై 11:** ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్దేశించిన గడువులోగా త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నూరూల్ కమర్ అన్నారు.శనివారం కర్నూలు జిల్లాలోని కల్లూరు గ్రామ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ ప్రత్యేక క్యాంప్‌లో కల్లూరు పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 100 నుండి 120 వరకు సంబంధించిన అన్ని బూత్‌లకు ఒకే కేంద్రంగా ఏర్పాటు చేసిన క్యాంప్‌లో సంబంధిత బీఎల్ఓలు హాజరై విధులు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు కూడా క్యాంప్‌కు వచ్చి తమ ఎన్యుమరేషన్ ఫార్మ్‌లు నింపడం జరిగింది. అలాగే ఓటరు జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి అవసరమైన మార్గదర్శకాలు అందించడం జరిగింది.కార్యక్రమాన్ని కర్నూలు జాయింట్ కలెక్టర్ & ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి నూరూల్ కమర్,అలాగే డిప్యూటీ తహసీల్దార్ అందాల శనివారం పరిశీలించారు.వారు ప్రతి బీఎల్ఓ వద్దకు వెళ్లి జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సేవలు మరియు ఎస్ఐఅర్ ప్రక్రియ అమలు తీరును తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గారు బీఎల్ఓలకు మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు, గుర్తించలేని ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే సమయంలో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు, వివరాల్లో మార్పులు లేదా తొలగింపులు కోరుకునే వారి దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం వెంటనే స్వీకరించి పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలందరికీ ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఅర్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను వివరించి, అవసరమైన పత్రాలతో ఫార్మ్‌లు సక్రమంగా సమర్పించాలని అవగాహన కల్పించారు. మొత్తం కార్యక్రమం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించబడింది.

# లోక్ అదాలత్‌లో 6,403 కేసులు పరిష్కారం



**పత్తికొండ జూలై 11:** పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో నిర్వహించిన జాతీయాలోపదాలతో 6,403 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి టీ. జ్యోష్ణ దేవి తెలిపారు. శనివారం స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్ లో సీసీ 58, ఎన్ఐ యాక్ట్ 3, ఎంసి 2, ఓఎస్ 17, ఇపి 17, ఎక్సైజ్ 39, పెట్టి కేసులు 6,267 మొత్తం కలిపి 6,403 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భాకరాపేటలో బస్సుల కోసం గంటల నిరీక్షణ

**• రద్దీతో ఆపని బస్సులు..మహిళలు, వృద్ధులు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు • సర్వీసులు పెంచాలని ప్రయాణికుల విజ్ఞప్తి**



**సిద్ధవటం జూలై 11:** మండలంలోని భాకరాపేట కూడలిలో శనివారం ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడం, కడప నుంచి వచ్చే బస్సులు రద్దీగా ఉండటంతో అక్కడ వేచి ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా శ్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎండ తీవ్రతలో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతి, రాజంపేట, రైల్వే కోడూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు బద్వేల్ వైపు వెళ్లేందుకు భాకరాపేటలో వేచి ఉన్నప్పటికీ, కడప నుంచి వచ్చే బస్సులు అప్పటికే రద్దీగా ఉండటంతో అక్కడ ఆగకుండా వెళ్లిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. భాకరాపేటబద్వేల్ మార్గంలో అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ విషయంపై బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ కన్యాకుమారి స్పందిస్తూ, డిపోలో బస్సుల కొరత ఉందని, కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. కడపబద్వేల్ మార్గంలోని ప్రతి బస్సు భాకరాపేటలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**కర్నూలు జూలై 11:**ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, అదనపు ఏఈఆర్ఓ లను ఆదేశించారు.శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ నమోదు తదితర పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు దగర పడుతోందని, ఈఎఫ్ డిజిటైజేషన్ శాతం, అన్‌కలెక్టబుల్ శాతం రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో పురోగతి నమోదు కాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈఎఫ్ డిజిటైజేషన్ కనీసం 6 శాతం, అన్‌కలెక్టబుల్ పర్సంటేజ్ 3 శాతం మొత్తం కలిపి 9 శాతం వస్తుందని ఆశించడం జరిగిందని, అయినప్పటికీ కేవలం 5.5 శాతం రావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతి తక్కువగా ఉందని కలెక్టర్ ఈఆర్ఓ లను ప్రశ్నించారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, సంబంధిత ఎంట్రీలను పూర్తి చేయాలని, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు నేరుగా పర్యవేక్షణ చేపట్టి పనులు వేగవంతం చేయాలని, ఏఎస్‌డీడీ ఎంట్రీలతో సహా అన్ని అంశాల్లో 100



శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 61 నుండి 70 డిజిటైజేషన్ శాతంలో కర్నూలులో 154 పోలింగ్ కేంద్రాలలో, పాణ్యం లో 69 పోలింగ్ కేంద్రాలలో ఉన్నాయన్నారు.. కలెక్టర్ సంబంధిత ఏఈఆర్ఓలు, అడిషనల్ ఏఈఆర్ఓలతో మాట్లాడుతూ 80 శాతం పురోగతి తీసుకొని రాకుండా కేవలం 61 శాతం మాత్రమే పురోగతి తెచ్చారని, అదే విధంగా అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ కేసులను ఒకేసారి పరిష్కరించి, సంబంధిత ఎంట్రీల అంశంలో జాప్యం జరుగుతోందని, ఈ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో కర్నూలు 71.23, పాణ్యం 74.90 శాతాలు ఉన్నాయన్నారు. బీఎల్ఓలను ఒకేచోట సమీకరించి, ఏఎస్‌డీడీ జాబితాల పరిశీలన, ధృవీకరణ, ఆన్‌లైన్ నమోదు పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పాణ్యం, కర్నూలు ఈఆర్ఓ, అదనపు ఏఈఆర్ఓ లను ఆదేశించారు.అందుకు సంబంధించిన నివేదికలను 2 గంటలకు ఒక్కసారి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ను ఆదేశించారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ పర్సంటేజ్ లో, అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ ఎంట్రీలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.జూలై 21 వ తేదీన కేవలం డ్రాఫ్ట్ లిస్ట్ మాత్రమే పబ్లిష్ చేస్తున్నామని, అందులో ఏమైనా కరెక్షన్ ఉంటే క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ సమయంలో ఫార్మ్ తీసుకొని కరెక్షన్ చేయవచ్చు అనే స్పష్టత బి ఎల్ ఓ లకు, వారి ద్వారా ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని నియోజకవర్గాల్లో గడువు లోపు సర్ ప్రక్రియ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ ఆర్వో లు, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం గారూ! కడప వైద్య కళాశాల సీట్ల పెంపు సరే!మరి పులివెందుల, ఇతర కళాశాలల మాటేమిటి..?: మాజీ ఎంపీ తులసి రెడ్డి

**వేంపల్లె జూలై 11:** 2026-27 విద్యా సంవత్సరం నుంచే కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో 75, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 25 ఎంబిబిఎస్ సీట్లను పెంచుతూ నేషనల్ మెడికల్ కమిషన్ లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇవ్వడం పై రాజ్యసభ మాజీ సభ్యుడు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో పులివెందుల, ఆదోని,మదనపల్లి, పెనుగొండ, మార్కాపురం, బాపట్ల,నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు,పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాలల పరిస్థితి ఏమిటి అని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను సూటిగా ప్రశ్నించారు వేంపల్లి లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు . పులివెందుల తో పాటు పైనపేర్కొన్న 9 ప్రభుత్వ వైద్య కళాశాలలు 2020 సెప్టెంబర్ 12న మంజూరయ్యాయని ఇంతవరకు ఆ కళాశాలల్లో తరగతులు ప్రారంభం కాలేదన్నారు . ఒక్కొక్క ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏడాదికి 150 ఎంబిబిఎస్ సీట్లు, 24 పీజీ సీట్లను విద్యార్థులుకోల్పోవడం జరిగిందన్నారు . ఆ విధంగా పైన పేర్కొన్న 10 ప్రభుత్వ వైద్య





కళాశాలల్లో 2024 -25 విద్యాసంవత్సరానికి సంబంధించి 1500 ఎంబిబిఎస్ సీట్లు,240 పిజి సీట్లు,2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1500 ఎంబిబిఎస్ సీట్లు,240 పిజి సీట్లు, 2026 - 27 కు సంబంధించి 1500ఎంబిబిఎస్ సీట్లు 240 పీజీ సీట్లు కోల్పోవడం జరిగిందన్నారు .మొత్తం మీద ఈ మూడు సంవత్సరాల్లో కలిపి 4500 ఎంబిబిఎస్ సీట్లు, 720 మెడికల్ పిజి సీట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కడప, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 ఎంబిబిఎస్ సీట్లు అదనంగా వచ్చినందులకు సంతోషపడాలా లేక 10 ప్రభుత్వ వైద్య కళాశాలలో 4500 ఎంబిబిఎస్ సీట్లు, 720 పిజి మెడికల్ సీట్లు కోల్పోయినందుకు బాధపడాలా అర్థం కాని పరిస్థితి ఉందని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా పైన పేర్కొన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక వసతులు పూర్తిచేసి, సిబ్బందిని నియమించి నేషనల్ మెడికల్ కమిషన్ తో మాట్లాడి 2026 - 27 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించే విధంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశు , చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రి, వేమా రాజా, రాఘవయ్య పాల్గొన్నారు.

# మండలంలో అంగన్వాడి సెంటర్లు రూటే సపరేటు

**• చూసి చూడనట్లు ఐసిడిఎస్ అధికారులు • మీడియా పర్యటనతో వెలుగులోకి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల భాగోతాలు.**


**వీరబల్లి జూలై 11:** ఊరంతా ఒక రూటు ఉలికి పిట్టకు ఒక రూటు అన్న చందంగా మండలంలోని అంగన్వాడి సెంటర్ల నిర్వహణ సాగుతోంది. నేడు శనివారం కావడంతో మండలంలోని ఏ ఒక్క అంగన్వాడీ సెంటర్ ను కూడా తెరవకుండా పిల్లలకు హాజరు వేసిన వైనం మండలంలో కనిపించింది. వివరాల్లోకెళ్తే కడప జిల్లా వీరబల్లి మండలం లోని పత్రికా విలేకర్లు పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడం జరిగింది. ఈ పర్యటనలో భాగంగా మండలంలో వంగిమళ్ళ పెద్దూరు కస్పాలోని అంగన్వాడి సెంటర్,వీరబల్లి మండల కేంద్రంలోని 1, 2 అంగన్వాడి సెంటర్లు,గుర్రప్పగారిపల్లె అంగన్వాడి సెంటర్,గుర్రప్పగారిపల్లి గ్రామంలోని సీటీకే తొగటపల్లి అంగన్వాడి కేంద్రం,సీటీకే ఎస్సీ కాలనీలో ఉండాల్సిన అంగన్వాడి సెంటర్ సిటీకే తొగటపల్లి లోనీ అంగన్వాడీ సెంటర్, షికారుపాలెంలో సెంటర్ ఓపెన్ లో ఉంది. కానీ అక్కడ పనిచేసే అంగన్వాడి కార్యకర్త రెండు నెలల నుంచి సెంటర్ కు రాలేదని తానే రికార్డుల నిర్వహణ చూస్తున్నానని అక్కడ పని చేసే ఆయా చెప్పుకొస్తుంది.









కానీ ఇక్కడ దాదాపు సంవత్సరం పైగా అక్కడ కార్యకర్త విధులకు రాలేదని సమాచారం.ఓదివీడు గ్రామంలో కుమ్మరపల్లి అంగన్వాడి సెంటర్,ఓదివీడు గ్రామంలో యర్రంరాజుగారిపల్లి అంగన్వాడి సెంటర్ ఇలా మండలంలోని దాదాపు అన్ని సెంటర్లు మూతపడ్డాయి. మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కార్యకర్తలు విధులకు హాజరు కాకున్నా ఇంట్లో కూర్చుని హాజరు వేసిన వైనం చూస్తుంటే మిగతా రోజుల్లో కూడా ఇలాగే చేస్తున్నారనే అనుమానం రాక మానదు. ఈ తంతు చూస్తుంటే అంగన్వాడి సెంటర్ల కు ఐసిడిఎస్ అధికారులు రెండో శనివారం సెలవు ఇచ్చారా? అనే అనుమానం రాక మానదు. రాష్ట్రమంతా ఒక రూల్.. వీరబల్లి మండలంలో ఒక రూల్.మండల వ్యాప్తంగా ఒక్క సెంటర్ లో కూడా కనిపించని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు. ఇదంతా ఒక ఎత్తైతే మరికొందరు కూటమి నాయకుల అండ చూసుకొని దర్జాగా ఇంటి వద్దనే ఉండి పిల్లలకు హాజరు వేశారు. ఇకనైనా పై అధికారులు స్పందించి తనిఖీలు చేసి పిల్లలకు సరైన పోషకాహారం మరియు చదువు నేర్పించాలని ప్రజలు తెలుపుతున్నారు.

# 100 మీటర్లు 10.14 సెకన్లలో.. తొలి భారతీయుడిగా అనిమేశ్ రికార్డు..!




భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఆశాకిరణంగా అవతరించిన అనిమేశ్ కుజుర్ (Animesh Kujur) మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇండియన్ ఉసేన్ బోల్ట్‌గా పేరొందిన ఈ కుర్రాడు విదేశీ గడ్డపై 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. జర్మనీ వేదికగా జరిగిన పుమా ఫాస్ట్ ఆర్న్బ్ లెగ్స్ 2026 మీట్‌లో సత్తా చాటిన అనిమేశ్ భారత్ అవతల ఇంత వేగంతో వంద మీటర్లు పరుగెత్తిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు.ట్రాక్ మీద బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న అనిమేశ్ కుజుర్ మళ్లీ మెరిశాడు. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద గురి పెట్టిన అతడు పుమా పాస్ట్ ఆర్న్బ్ లెగ్స్ 2006 మీట్‌లో చిరుతలా పరుగుతీశాడు. 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేసి ఔరా అనిపించాడు. తొలుత 10.19 సెకన్లకు పరిమితమైన అనిమేశ్ ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అయితే.. అత్యంత వేగంగా 100 మీటర్ల పరుగుతో రికార్డు సాధించిన గురిందెర్వీర్ సింగ్(10.09 సెకన్లు)ను మాత్రం అందుకోలేకపోయాడీ రన్నర్.

# క్రాంతికి మూడు వికెట్లు.. పోరాడుతున్న ఇంగ్లండ్ కెప్టెన్..!

లార్డ్స్ టెస్టులో భారత జట్టు పట్టుబిగిస్తోంది. తొలిరోజే ఆలౌటైన టీమిండియా.. రెండో రోజు ఇంగ్లండ్‌ను వణికించింది. మొదటి సెషన్‌లోనే పేసర్ క్రాంతి గౌడ్(3-25) వికెట్ల వేట కొనసాగించగా.. ఆతిథ్య జట్టు బెంబేలెత్తిపోయింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(1-36), స్నేహ్ రాణా(1-35) రెచ్చిపోగా సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(39 నాటౌట్) పోరాడుతోంది. లంచ్ సమయానికి ఇంగ్లండ్ 150 కూడా కొట్టలేకపోయింది.స్వదేశంలో చెలరేగాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లకు భారత పేసర్లు చుక్కలు చూపిస్తున్నారు. లార్డ్స్ టెస్టులో క్రాంతి గౌడ్(3-25) నిప్పులు చెరగడంతో తొలి రోజే ఓపెనర్ టమ్మీ బ్యూమంట్(2)ను కోల్పోయిన ఆతిథ్య జట్టు.. రెండో రోజు తొలి సెషన్‌లోనూ మరో రెండు వికెట్లు నష్టపోయింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది.



# మెస్సీకి 'పెనాల్టీ' షాక్ ఇస్తారా.. అర్జెంటీనా మేనేజర్ సమాధానమిదే..!



ఫిఫా వరల్డ్‌కప్‌లో నాకౌట్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు వేళైంది. కొలంబియాకు చెక్ పెట్టిన స్విట్జర్‌లాండ్‌ను లియోనల్ మెస్సీ సేన ఢీకొట్టనుంది. కీలకమైన మ్యాచ్ కావడంతో ఏ చిన్న పొరపాటు చేయొద్దని ఇరుజట్లు భావిస్తున్నాయి. అయితే.. ఫామ్‌లో ఉన్న మెస్సీ పెనాల్టీలను గోల్‌గా మలచలేకపోవడం డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను వేధిస్తోంది. ఈ నేపథ్యంలో స్విస్ మ్యాచ్‌కు ముందు అర్జెంటీనా మేనేజర్ లియోనల్ స్కలోని మీడియాతో మాట్లాడుతూ పెనాల్టీ అవకాశం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆడుతున్న అర్జెంటీనాకు నాకౌట్‌లో సవాళ్లు ఎదురవుతున్నాయి. కార్బో వెర్డే, ఈజిప్ట్ చేతిలో అతికష్టమ్మీద గట్టెక్కిన మెస్సీ సేన.. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్‌లాండ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. ఆదివారం ఉదయం 6 గంటలకు మ్యాచ్ ఉన్నందున మేనేజర్ లియోనల్ స్కలోని మీడియాతో మాట్లాడాడు. ఈ ఎడిషన్‌లో రెండు పెనాల్టీలను గోల్ పోస్ట్‌లోకి పంపని మెస్సీకి మరో అవకాశం ఇస్తారా లేదా అనే ప్రశ్నకు అతడు అవును అనిగానీ, కాదు అనిగానీ చెప్పలేదు.

# వింబుల్డన్‌కు క్రికెట్ కళ.. రాయల్ బాక్స్‌లో గిల్, సచిన్..!



ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ టోర్నీకి క్రికెట్ కళొచ్చింది. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ గ్యాలరీలో సచిన్ టెండూల్కర్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తళుక్కుమన్నారు. రాయల్ బాక్స్‌లో రాయల్ లుక్‌తో గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. సతీమణి అంజలి సమేతంగా సచిన్ హాజరయ్యాడు. విరామంలో వీరితో టెన్నిస్ గ్రేట్ రోజర్ ఫెదరర్ కలవడంతో కెమెరా కళ్లన్నీ వీరివైపే తిరిగాయి.వన్డే సిరీస్‌కు ముందే ఇంగ్లండ్ చేరుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బిజీగా గడుపుతున్నాడు. పాప్ సింగర్లను కలిసి.. మెర్సిడెజ్ బెంజ్ గ్యారేజ్‌లో ఫార్ములా వన్ రేసర్ ఆంటినెల్లాతో కలిసి కారిడార్ క్రికెట్ ఆడిన గిల్ ఈసారి వింబుల్డన్‌లో మెరిశాడు. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీసమేతంగా మ్యాచ్ చూసేందుకు రాగా.. రాయల్ బాక్స్‌లో వారి పక్కనే కూర్చున్నాడు టీమిండియా కెప్టెన్. మ్యాచ్ చూసేందుకు వచ్చిన వెస్టిండీస్ వెటరన్ బ్రియాన్ లారా, టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెదరర్‌తో కాసేపు ముచ్చటించాడు గిల్. జకోవిచ్, సినర్ మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ వీక్షించారు వీరంతా.

# నేడు ఐదో టీ20.. సంజూ శాంసన్‌కు ఛాన్స్

హైదరాబాద్ : ఇంగ్లండ్‌తో ఐదో టీ20 మ్యాచ్ కోసం టీమిండియా సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే మూడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన భారత్, కనీసం ఈ మ్యాచ్‌నైనా గెలిచి క్లీన్ స్వీప్ కాకుండా గౌరవాన్ని కాపాడుకోవాలని భావిస్తోంది. జోఫ్రా ఆర్చర్, సామ్ కరన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఫామ్‌లో లేని తిలక్ వర్మ స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలని అభిమానులు కోరుతున్నారు. బ్యాటింగ్ ఆర్డర్ దెబ్బతింటుందని హెడ్ కోచ్ గంభీర్ భావిస్తున్నాడు. మరి ఛాన్స్ ఇస్తారా లేదా చూడాలి.




# స్మృతి మంధాన అరుదైన ఘనత



హైదరాబాద్: భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఏకైక మహిళల టెస్టు తొలి రోజున ఆమె తన కెరీర్‌లో 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. దీంతో భారత్ తరఫున 300 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అతి పిన్న వయస్కురాలైన మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. 29 సంవత్సరాల 357 రోజుల వయస్సులో ఈ మైలురాయిని అందుకుంది.స్మృతి మంధాన అంతర్జాతీయ కెరీర్ 2013 ఏప్రిల్ 5న బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌తో ప్రారంభమైంది. అప్పటి నుంచి మూడు ఫార్మాట్లలోనూ నిలకడగా రాణిస్తూ భారత మహిళల క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఇప్పటివరకు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 4,538 పరుగులు, వన్డేల్లో 5,411 పరుగులు చేసింది. టెస్టు క్రికెట్‌లో తొమ్మిది మ్యాచ్‌ల్లో 718 పరుగులు నమోదు చేసిన ఆమె రెండు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలు సాధించింది. లార్డ్స్ టెస్టులో చేసిన పరుగులతో మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, శుభాంగి కులకర్ణిలను అధిగమించి భారత మహిళల తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా నిలిచింది. **భారత్‌కు ఆధిక్యం.. ఇంగ్లాండ్‌కు తొలి షాక్ ...** మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ సైవర్-బ్రంట్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలోనే షఫాలీ వర్మ డకౌట్ అయినా, మంధాన బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకుంది. అనంతరం హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ అర్ధశతకాలతో రాణించడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు భారత బౌలర్లు శుభారంభం అందించారు. క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో టామీ బ్యూమాంట్ కేవలం రెండు పరుగులకే ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 264 పరుగుల వెనుకబడి ఉండటంతో రెండో రోజు ఆటపై ఆసక్తి నెలకొంది.

# చెన్నైలో బిగ్‌బాష్ లీగ్



## ఆరంభ మ్యాచ్‌కు చెపాక్ ఆతిథ్యం

## భారత్, ఆసీస్ ప్రధానుల సమక్షంలో ప్రకటన

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా), భారత్, ఆస్ట్రేలియా ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల్లో అతిపెద్ద అడుగు పడింది. ఇప్పటికే కబడ్డీ, క్రికెట్ లీగ్‌లలో ఎంపిక చేసిన మ్యాచ్‌లను ఆస్ట్రేలియాలో నిర్వహించే ఆలోచనలకు పదునెక్కుతుండగా.. తాజాగా బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్ ఆరంభ మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించనున్నారు. భారత ప్రధాని నరెంద్ర మోడి ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. సెంటర్ ఆఫ్ ఆస్ట్రేలియా-భారత్ రిలేషన్స్ సంస్థ దీనికి ఆర్థికంగా మద్దతు ఇవ్వనుంది. క్రికెట్ ఆస్ట్రేలియా సైతం నిదులు సమకూర్చనుంది. భారత ప్రధాన మోడి, ఆసీస్ ప్రధాని అల్బనీస్ సమక్షంలో క్రికెట్ ఆస్ట్రేలియా శుక్రవారం మెల్‌బోర్న్‌లో ఈ ప్రకటన చేసింది. భారత్ సైతం ఐపీఎల్ మ్యాచ్‌లను ఆస్ట్రేలియాలో నిర్వహించే ఆలోచన చేస్తుందని సీఏ ఆశాభావం వ్యక్తం చేసింది.డిసెంబర్ 12న చెన్నైలో ఆరంభ మ్యాచ్ :బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్ షెడ్యూల్‌ను ఇంకా ఖరారు చేయలేదు. కానీ భారత్‌లో ఆరంభ మ్యాచ్ ప్రకటన కోసం తొలి మ్యాచ్ తేదిని వెల్లడించారు. డిసెంబర్ 12న ఆరంభ మ్యాచ్ చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరుగనుంది. డిఫెండింగ్ చాంపియన్స్ పెర్త్ స్కార్చర్స్‌తో మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తలపడుతుంది. డిసెంబర్ 6న షెఫల్డ్ షీల్డ్ దేశవాళీ టోర్నీ ముగియనుండగా.. ఈ రెండు జట్ల ఆటగాళ్లు నేరుగా చెన్నైకి చేరుకోనున్నారు. చెపాక్‌లో మెల్‌బోర్న్, పెర్త్ జట్ల ఆటగాళ్లు మ్యాచ్ ముంగిట నాలుగు రోజుల పాటు సాధన చేయనున్నారు. బిగ్‌బాష్ లీగ్ మిగతా మ్యాచ్‌లన్నీ ఆస్ట్రేలియాలో జరుగుతాయి. దీంతో ఈ రెండు జట్లకు రెండో మ్యాచ్‌కు కనీసం ఓ పది రోజుల విరామం లభించేలా షెడ్యూల్ రూపొందించనున్నారు. బిగ్‌బాష్ లీగ్‌ను ఐపీఎల్ తరహాలో ప్రయివేటీకరణ చేసేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా ఆలోచన చేస్తుండగా... మెల్‌బోర్న్, పెర్త్ జట్ల యాజమాన్యాలు (రాష్ట్ర క్రికెట్ సంఘాలు) క్రికెట్ విక్టోరియా, వెస్టర్న్ ఆస్ట్రేలియాలు అందుకు సుముఖంగా ఉన్న సంగతి తెలిసిందే. చెన్నైలో ఆడేందుకు పలు క్లబ్‌లు ఆసక్తి చూపించాయని.. ఆరంభ మ్యాచ్‌కు స్టేడియం అభిమానులతో నిండుతుందని సీఏ దీమా వ్యక్తం చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియాతో జత కట్టి.. బిగ్‌బాష్ లీగ్ ఆరంభ మ్యాచ్‌కు ఆతిథ్యం అందించటం గౌరవంగా భావిస్తున్నామని తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టిఎన్‌సీఏ) ప్రెసిడెంట్ టిజె శ్రీనివాసరాజ్ అన్నారు.

ఆదివారం, జూలై 12, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 12

# మురుగన్ నేపథ్యంలో చిత్రాలు

## తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు







దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో
ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బ్జడెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

## లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున




తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భాగ్యశ్రీ ..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో



# షూటింగ్ లో గాయపడ్డ రాశి ఖన్నా

బిజీ కథానాయిక రాశి ఖన్నా షూటింగ్ సెట్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం టాలీవుడ్ కంటే తమిళ్, హిందీ ప్రాజెక్టులపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టిన ఈ బ్యూటీ.. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న ఓ భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రాశి ఖన్నాకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. యాక్షన్ సీన్స్ చేస్తున్నప్పుడు దెబ్బలు తగిలినప్పటికీ, రాశి ఖన్నా ఎక్కడా బ్రేక్ తీసుకోలేదు. తన వల్ల షూటింగ్‌కు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గాయంతోనే ఆ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఒక ఫీమేల్ యాక్టర్రై ఉండి కూడా డూప్ లేకుండా క్లిష్టమైన స్టంట్స్ చేయడం, గాయపడినా వెనకడుగు వేయకపోవడంతో ఆమె అంకితభావాన్ని చూసి నెటిజన్లు, అభిమానులు సెల్యూట్ చేస్తున్నారు.ఇక తెలుగు సినిమాల విషయానికి వస్తే.. రాశి ఖన్నా ఇటీవల నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది. కమర్షియల్‌గా ఈ సినిమా నిరాశపరచడంతో పాటు, ఇందులో ఆమె పోషించిన క్యారెక్టర్‌కు కూడా పెద్దగా స్కోప్ లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ బాలీవుడ్ ప్రాజెక్టులపైనే ఉన్నాయి.






# 'తక్షకుడు' షూటింగ్ పూర్తి చేసిన ఆనంద్ దేవరకొండ..

ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'తక్షకుడు' సినిమా షూటింగ్ పూర్తైంది. ఈ విషయాన్ని ఆయన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు. నటుడిగా తనకు అత్యంత సంతృప్తినిచ్చిన చిత్రాల్లో ఇదొకటని చెప్పారు. 'మిడిల్ క్లాస్ మెలోడీస్' తర్వాత దర్శకుడు వినోద్ అనంతోజుతో మళ్లీ పని చేయడం ఆనందంగా ఉందన్నారు. కథను, నటుడిని విభిన్నంగా చూసే దర్శకుడు ఆయన అని ప్రశంసించారు. తెలుగు ఫోక్‌లోర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ అంధుడి పాత్రలో కనిపించనున్నారు. గ్రామస్థుల మరణాలకు కారణమైన వారిపై తన పెంపుడు కుక్కతో కలిసి ప్రతీకారం తీర్చుకునే వ్యక్తిగా నటిస్తున్నారు. ఈ పాత్ర తనకు సవాల్‌గా అనిపించిందని, అదే సమయంలో ఎంతో ఆసక్తికరంగా కూడా ఉందని తెలిపారు. లుక్ టెస్ట్ స్కెచ్‌లు, షూటింగ్ సమయంలో తీసిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు.సినిమాలో తనతో కలిసి నటించిన 'బెర్లిన్' అనే కుక్కతో మంచి అనుబంధం ఏర్పడిందని ఆనంద్ తెలిపారు. దర్శకుడు భావోద్వేగాలకు తగ్గట్టుగా సహజమైన యాక్షన్ చేయించారని వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని, త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యే 'తక్షకుడు' ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 24న రామాయణ ట్రైలర్ విడుదల




భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com